


ఆ రోజుల్లో..

ముప్పై, నలభై ఏళ్ల క్రితం మాట. టీవీ వచ్చిన కొత్తల్లో.. ఊరికి ఒకటో, రెండో ఉండేవి. శుక్రవారం రాత్రి చిత్రలహరి, శనివారం సాయంత్రం హిందీ సినిమా, ఆదివారం సాయంత్రం తెలుగు సినిమాలకు వున్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఇక ఆదివారం ఉదయం వచ్చిన రామాయణం, మహాభారతం కోసం పిల్లలు, పెద్దలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసేవారు. టీవీ వున్న ఇంటికి ఆ చుట్టుపక్కల వారంతా ఆ కార్యక్రమాలు వచ్చే సమయానికి చేరిపోయేవారు. వారం మొత్తానికి ఇదే వారి వినోదం. వీటిని చూసి, వీటిపై స్కూళ్లల్లో పిల్లలు చర్చలు పెట్టేవారు.. టెలివిజన్ దినోత్సవం సందర్భంగా నాటి ముచ్చట్లు.. - 6లో..





మధ్యాహ్న భోజనం వికటించి తొమ్మిది మంది విద్యార్థులకు అస్వస్థత



135 సెల్‌ఫోన్లు దొరికాయ్.. బాధితులకు అందజేసిన ఎస్పీ

7

మెరిసేదంతా వెండి కాదండోయ్.. ఆరా తీయకుంటే నష్టమే

నువ్వా.. నేనా..!

హోరెత్తుతున్న టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల పోరు

- హ్యాట్రిక్‌కు యూటీఎఫ్ ఆరాటం
- అధిగమించేందుకు మిగతా అభ్యర్థుల కార్యాచరణ
- ఉమ్మడి పశ్చిమ అత్యంత కీలకమే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు హోరాహోరీగా సాగబోతున్నాయి. ఆరుగురు అభ్యర్థులు పోటీ పడుతుండడంతో ఆయా ఉపాధ్యాయ సంఘాలు తమకు ఇష్టమైన అభ్యర్థికి మద్దతుగా హైస్కూల్‌స్థాయిలో ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. టీచర్లను కలిసి మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థులే గెలుపొందారు. ఈసారి హ్యాట్రిక్ దక్కించుకోవడానికి అనుకూలురు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. నామినేషన్ల పర్వం ఈ నెల 11న ప్రారంభం కాగా యూటీఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపిమూర్తిని ప్రకటించారు. యూటీఎఫ్‌లో కీలకంగా వ్యవహరించి ఈ మధ్యనే ఉద్యోగ విరమణ చేసిన ఆయన ఓటర్ల ముందు నిలబడేలా సీపీఎం జాగ్రత్తపడింది. ఆయనకు దీటుగా గంధం నారాయణరావు పోటీలో వున్నారు. వీరితోపాటు నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, అహ్మద్‌షేక్ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య గతంలో పోటీ సాధారణంగా ఉండేది. 2009, 2015లో జరిగిన ఎన్నికలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీ స్వరూపాన్నే మార్చేశాయి. 2015లో యూటీఎఫ్ అభ్యర్థిగా రాము సూర్యారావు (ఆర్‌ఎస్‌ఆర్) పోటీకి దిగగా, ఆయన ప్రత్యర్థులు గెలుపొందాలని కోట్ల రూపాయల విలువైన బహుమతులను ఉపాధ్యాయులకు ఎరగా వేశారు. సాధారణ ఎన్నికలను తలపించేలా రాత్రి పొద్దు పోయే వరకూ ఓటర్ల ఇళ్ల చుట్టూ తిరిగి నానా హంగామా చేశారు. చివరకు సాధారణ కార్యకర్తగా ప్రచారం చేసిన రాము సూర్యారావు భారీ మెజార్టీతో విజయం దక్కించుకున్నారు. ఆ తర్వాత 2021లో జరిగిన ఎన్నికల్లోనూ యూటీఎఫ్ పక్షాన షేక్ సాబ్జి పోటీలో నిలబడి అలవోకగా విజయం సాధించారు. కాని, ఆయన గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానంలో తాజాగా పోటీ జరగబోతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం హైస్కూల్ ఉపాధ్యాయులే ఓటర్లుగా ఉంటారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మొత్తం 16,316 మంది ఓటర్లు ఉండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,947 మంది, ఏలూరు జిల్లాలో 2,605 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణపై రెండు జిల్లాల యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు డివిజన్‌లో 33, నూజివీడు డివిజన్‌లో 6, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో మండలానికి ఒక కేంద్రం చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఏలూరు జిల్లా మొత్తం ఓటర్లలో ఒక్క ఏలూరు నగరంలో అత్యధికంగా 900 మంది పైబడి ఉన్నారు. వచ్చే నెల 5న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాబోయే పక్షం రోజులు అత్యంత కీలకంగా ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ప్రతి హైస్కూల్‌ను సందర్శించి వారి మద్దతు కోరుతున్నారు. అహ్మద్ షేక్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. ఎన్నికల బరిలో ఐదుగురు ఉన్నారు. నేటితో ఉపసంహరణల గడువు ముగుస్తుంది.

హోరాహోరీనే..



- గోపిమూర్తి, నారాయణరావు మధ్య పోటీ అనివార్యంగా మారింది. గతంలో పోటీ చేసి ఓటమి పాలైన నారాయణరావు తిరిగి పోటీకి దిగారు. ఆయనకు ఎస్టీయూతోపాటు మరి కొందరు ఉపాధ్యాయులు మద్దతు ఇస్తున్నారు. యూటీఎఫ్ దూకుడుకు తానే బ్రేక్ వేస్తాననే ధోరణిలో ధీమా వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు మిగతా అభ్యర్థులు రెండు, మూడు రోజుల్లో ప్రచారాన్ని రసవత్తరంగా మార్చాలనే వ్యూహంలో వున్నారు.

నేటి నుంచి 104 వాహనాల ఉద్యోగుల వినతులు

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు భరత్ భూషణ్

ముదినేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ 104 వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈవోలు) తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 21 నుంచి 30 వరకు చేపట్టనున్న కార్యాచరణను ఆ ఉద్యోగుల యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు భరత్ భూషణ్ బుధవారం ప్రకటించారు. ఇప్పటి వరకు గ్రామ, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులకు తమ కోర్కెల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈనెల 21 నుంచి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత, 21, 22, 23 తేదీల్లో జిల్లా పరిషత్ చైర్మన్లు, జడ్పీటీసీలకు, 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, 27, 28 తేదీల్లో రాష్ట్ర మంత్రులకు, 29, 30 తేదీల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు వినతిపత్రాలు అందజేసి తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని విన్నవిస్తామని భరత్ భూషణ్ తెలిపారు.



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల దోపిడీ

- ఆస్పత్రి ఉద్యోగులే దళారులు
- కలెక్టర్ చెప్పిన ధరలు అమలు చేయడంలో అధికారుల వైఫల్యం
- గగ్గోలు పెడుతున్న బాధిత బంధువులు

ఏలూరు క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):తమ సంబంధీకుల మృతి చెందారన్న బాధతో వీరు కుమిలిపోతుండగా.. పార్థివదేహం తరలింపులో ఆస్పత్రి సిబ్బంది, ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు కుమ్మక్కై అడ్డంగా దోచేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఎవరైనా రోగి మరణించినా, రిఫరల్‌కు బయట ఆస్పత్రులకు తీసుకెళ్లాలన్నా ఆస్పత్రి వార్డులలో కొందరు ఎంఎన్‌వోలు, వార్డు బాయ్‌లు క్షణాల్లో ప్రైవేటు అంబులెన్సుల వారికి సమాచారం ఇస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఇందులో 10 నుంచి 20 శాతం వరకు ఆ సొమ్ములను ఎంఎన్‌వోలకు, వార్డు బాయ్‌లకు ఇవ్వడం బహిరంగ రహస్యం.

కరోనా సమయంలో ఈ పరిస్థితులు ఏర్పడితే అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఆస్పత్రి అధికారులు ఒక కమిటీగా ఏర్పడి ప్రైవేటు అంబులెన్సుల ధరలను నిర్ణయిస్తూ 2021 మే 9న కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని అమలుచేయాలని పోలీసు, రవాణా, రెవెన్యూ, ఆస్పత్రి అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. కొంతకాలంపాటు ప్రైవేటు అంబులెన్సుల వారు సజావుగా ఆ ధరల ప్రకారం తీసుకున్న తర్వాత క్రమేపీ వారి ఇష్టారాజ్యంగా మారింది. 2023 ఏప్రిల్ 26న ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు అవ్వడం, ఏలూరు ప్రభుత్వాస్పత్రిని టీచింగ్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో అప్పటినుంచి ప్రైవేటు అంబులెన్సుల వారు అడ్డూ అదుపు లేకుండా ధరలను పెంచేసుకున్నారు. ఇక రాత్రివేళ అయితే వారు చెప్పే ధరలు అంతా ఇంతా కాదు. ప్రభుత్వాస్పత్రికి రెండు మహా ప్రస్థానం వాహనాలు ఉన్నాయి. ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వాహనాలు ఆస్పత్రి నుంచి మృతదేహాలను మృతుల బంధువులు కోరుకున్న ప్రాంతాలకు (జిల్లాలో మాత్రమే) ఉచితంగా తీసుకువెళ్తూ ఉంటారు. ఈ వాహనాలు ఎక్కడ ఉంటాయో, ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి. గతంలో దీనికి సంబంధించి ఫ్లెక్సీలపై ఆ వాహనాలకు సంబంధించిన ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆ వాహనాలు కాని, డ్రైవర్ల వివరాలు, అత్యవసర విభాగం వద్ద కనిపించడం లేదు. చివరకు మృతుని బంధువులు ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. పరోక్షంగా ఈ మహా ప్రస్థానం డ్రైవర్లు సహకరిస్తున్నారని, వీరికి ప్రైవేటు అంబులెన్సులు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. పైన చెప్పిన పట్టిక ప్రకారం ప్రైవేటు అంబులెన్సులు తీసుకోవాలి. ఈ ధరల పట్టికను ఆసుపత్రి అత్యవసర విభాగం గేటు వైపు పెద్ద ఫ్లెక్సీ రూపంలో కనిపిస్తున్నా అవి ఎక్కడా అమలుకావు. ఎవరైనా ఫిర్యాదు చేయాలంటే ఏలూరు టూ టౌన్ పోలీస్‌స్టేషన్, ఉప రవాణా కమిషనర్‌కు ఫోన్ చేయవచ్చని ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఏనాడు ఇక్కడకు వచ్చి తనిఖీలు చేయలేదు. కలెక్టర్ జారీచేసిన ధరల పట్టికను అమలు చేయడంలో అధికారులు విఫలం కావడంతో ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. వాస్తవానికి అంబులెన్సులకు సరైన రికార్డులు, ఫిట్‌నెస్ లేవు. రవాణాశాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, ఆసుపత్రి అధికారులు వీటి విషయంలో ఎందుకు గోప్యత పాటిస్తున్నారోనని రోగుల బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బుట్టాయిగూడెం మండలం ముప్పినివారిగూడెంకు చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్యానికి గురికాగా ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా ఆమె మరణించింది. అక్కడి వార్డు సిబ్బంది హడావుడి చేసి మృతదేహాన్ని వెంటనే తీసుకువెళ్ళిపోవాలని ఆమె కుమారుడిని కంగారు పెట్టాడు. అతను మహాప్రస్థానం అంబులెన్సు కోసం ఆరా తీయగా అందుబాటులో లేవని చెప్పారు. చివరకు ప్రైవేటు అంబులెన్సుకు పది వేలు చెల్లించి మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తీసుకువెళ్లారు. 72 కిలోమీటర్ల దూరానికి 3,520 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా రూ.పది వేలు వసూలు చేశారు.

ఈ నెల 17వ తేదీ రాత్రి భీమడోలుకు చెందిన మృతదేహాన్ని రూ.6,500 ఆస్పత్రి ఉద్యోగి ప్రైవేటు అంబులెన్సు కిరాయి మాట్లాడి పంపించాడు. వాస్తవానికి రూ.2,400 ప్రైవేటు అంబులెన్సుల వారు తీసుకోవాలి. కాని 4,100 రూపాయలు అధికంగా వసూలు చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు

- ఏలూరులో రోగిని లేదా మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి నుంచి నగరంలోని మరో ఆస్పత్రికి వెళ్లాలంటే రూ.500 నుంచి రూ.1000 వసూలు చేయాలి.
- పది కిలోమీటర్ల వరకు.. మారుతి ఓమ్నీ అంబులెన్సు, టెంపో ట్రావీలర్ అంబులెన్సు రూ.1700. అంబులెన్సులో ఆక్సిజన్ పెడితే గంటకు రూ.200 చొప్పున వసూలు చేస్తారు.

11 నుంచి 20 కిలోమీటర్లకు	2,200
21 నుంచి 30 కిలోమీటర్లు	2,400
31 నుంచి 40 కిలోమీటర్లు	2,600
41 నుంచి 50 కిలోమీటర్లు	2,860
51 నుంచి 60 కిలోమీటర్లు	3,038
61 నుంచి 70 కిలోమీటర్లు	3,300
71 నుంచి 80 కిలోమీటర్లు	3,520
81 నుంచి 90 కిలోమీటర్లు	3,740
91 నుంచి 100 కిలోమీటర్లు	5,060
101 నుంచి 110 కిలోమీటర్లు	4,620



ఆ స్కూళ్లల్లో టైమింగ్స్ మార్పు

- పశ్చిమలో 20, ఏలూరు జిల్లాలో 27 హైస్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిగంటల పెంపు : డీఈవోల ఉత్తర్వులు జారీ

ఏలూరు అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్/ నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏలూరు, పశ్చిమ గోదావరి, జిల్లాల్లోని 47 హైస్కూళ్లలో గురువారం నుంచి పని గంటలు మారనున్నాయి. ఎస్‌సీఈఆర్‌టీ అకడమిక్ కేలండర్ ప్రకారం మండలానికో ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి పైలట్ ప్రోగ్రాంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులను నిర్వహిస్తారు. రెండు జిల్లాల డీఈవోలు నారాయణ, వెంకటలక్ష్మమ్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమలో 20, ఏలూరులో 27 స్కూళ్లల్లో పీరియడ్‌ను 40 నుంచి 45 నిమిషాలకు పెంచుతారు. పాఠశాల ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. ఇవి ఈ నెల 30వ తేదీ వరకు అమలవుతాయి. ఆ ప్రకారం టైం టేబుల్‌ను విడుదల చేశారు. సిలబస్‌ను సమగ్రంగా కవర్ చేసేందుకు ప్రస్తుతం వున్న ఎనిమిది పీరియడ్లను పెంచకుండానే కేవలం ఒక్కో పీరియడ్ వ్యవధిని మాత్రమే నిర్దేశిత పనివేళలకు సరిపడేలా నిర్ణయించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత హైస్కూళ్లలో పెంచిన పనివే ళలు అమలుచేసే బాధ్యత ఆయా డివిజన్ల ఉప విద్యాశాఖాధి కారులదేనని, ఆ మేరకు పైలట్ ప్రోగ్రాంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం పంపాలని డీవైఈవోలను ఆదేశించారు.



పండిన పత్తిని పొలం నుంచి ఇంటికి తీసుకెళ్తున్న రైతు

దిగుబడి లేదు.. ధరా తగ్గింది!

- పత్తి రైతుల ఆవేదన.. క్వింటా రూ.6వేలు మాత్రమే
- సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి

కుక్కునూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర లేక పత్తిరైతు విలవిలాడుతున్నాడు. పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. క్షేత్రస్థాయిలో ఆ ధర పలకడం లేదు. సీజన్ ఆరంభంలో క్వింటా పత్తి రూ.10 వేలు పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.6వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వర్షాలు లేక అనావృష్టితో పత్తి దిగుబడులు ఎకరానికి 3 నుంచి 5 క్వింటాలే దిగుబడి రాగా ఆరంభంలో క్వింటా రూ.6వేలు కొనుగోలు చేయగా చివరికి రూ.7వేలు పలికింది. అయినా రైతాంగం దిగుబడిలేక, ఆశించిన ధరలేక అప్పుల పాలయ్యారు. ఈ ఏడాది అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఐదు నుంచి ఏడు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాదైనా ధర ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశించగా ప్రస్తుతం క్వింటా రూ.6వేలే పలుకుతోంది. పత్తిలో తేమశాతం అధికంగా ఉందని పింజా పొడవు తక్కువగా ఉందని ధర తక్కువకే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.7,521 మద్దతు ధర ప్రకటించినా రైతులకు ఆ ధర దక్కడం లేదు.

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి..

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఈ ఏడాది దాదాపు 15 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోందని రెండు మండలాలకు కలిపి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో కుక్కునూరులో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా పత్తి కొనుగోలు చేయడంతో రైతులకు మద్దతు ధర లభించేంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరగలేదు. ఈ క్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, తదితరులు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను కలిసి కుక్కునూరులో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పత్తి రైతుకు న్యాయం జరుగుతుందని విన్నవించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించడంతో సీసీఐ కేంద్రం కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

6,726 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం , నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు 6,726 క్యూసెక్కుల జలాలను విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు బుధవారం తెలిపారు. గోదావరి నీటి మట్టం 14.032 మీటర్లు నమోదు కాగా 19 పంపులు 19 మోటార్ల ద్వారా నీటి విడుదల చేసినట్టు తెలిపారు.



భీమవరంలో శ్రీశైలం భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

శోభాయమానం.. కార్తీక దీపం

6



దీపం వెలిగిస్తున్న పశ్చిమ గోదావరి కలెక్టర్ నాగరాణి



శోభాయమానం.. కార్తీక దీపోత్సవం



శ్రీశైల మల్లికార్జునస్వామి కల్యాణం

భీమవరం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఆనందరాజు ఫంక్షన్‌హాల్ ప్రాం గణంలో దేవదాయ శాఖ, ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీశైలం నుంచి వచ్చిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా సాగింది. స్వామివార్ల ఉత్సవమూర్తులు వున్న రథం సాయంత్రం గునుపూడి నుంచి శోభాయాత్రగా ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, మీదుగా ఆనందా ఇన్‌కు చేరుకుంది. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీశైలం మల్లికార్జునస్వామి ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శాస్త్రి ఆధ్వర్యంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులకు కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. అనంతరం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, దంపతులు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి దంపతులు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ దంపతులు పూజల్లో పాల్గొన్నారు.





కేంద్రమంత్రి వర్మ, జేడీ లక్ష్మీనారాయణ..



వ్యాయామ కళాశాలలో వాలీబాల్ పోటీలు

దెందులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెం సీతారామ వ్యాయామ కళాశాల ఆవరణలో బుధవారం అంతర్గత వాలీబాల్ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతాని యాల్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో మొదటి మ్యాచ్‌లో రవికుమార్ దయ వర్సెస్ మేజర్ ధ్యాన చంద్ టీమ్‌లు పోటీపడగా ధ్యానచంద్ టీం విజయం సాధించింది. బాలిక విభాగంలో మొదటి టీంలో మిథాలి వర్సెస్ పివి చందు టీంలు పోటీపడగా అందులో చందు జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో రెండో మ్యాచ్ మిల్కాసింగ్ టీం, బాలికల్లో సైనా నెహ్వాల్ టీం విజయం సాధించాయి. విజేతలకు మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, బాబు, ప్రిన్సిపాల్ బహుమతులను అందించారు.

మారని మత్స్యకార బతుకులు

ఇంకా సంప్రదాయ వేటే ఆధారం

వేటాడితేగాని పూట గడవని పరిస్థితి

ప్రభుత్వ సాయం అంతంతే..

అభివృద్ధికి ఆమడదూరంలో మత్స్యకార గ్రామాలు

నదీ జలాల కాలుష్యంతో హరించిపోతున్న మత్స్య సంపద

నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

కెరటాలకు ఎదురీత



కెరటాలతో నిత్యం పోరాటం.. అడుగడుగునా ప్రాణసంకటం.. అయినా వేటే వారి జీవనాధారం.. అందులోనే ఆనందం.. మత్స్య సంపద దొరికితేనే సంతోషం.. లేకపోతే... పస్తులే. ఇదీ మత్స్యకార జీవన చిత్రం. తరాలు మారుతున్నా వీరి బతుకులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే మిగిలాయి. వల వేసి చేప పట్టడం తప్ప మరో పని చేయలేని పరిస్థితి. జిల్లాలో చాలా మంది మత్స్యకారులు వేట సాగించలేక వలస కూలీలుగా మారిపోతున్నారు. ఇక ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడల్లా వేటకు విరామం ఇవ్వాల్సిందే. నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని మత్స్యకారుల జీవనంపై ప్రత్యేక కథనం

నరసాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా మత్స్య సంపదకు పెట్టింది పేరు. నిత్యం రూ.10 కోట్లపైనే వ్యాపారం సాగుతోంది. ఇందులో అత్యధిక ఆదాయం సముద్ర వేట నుంచి వచ్చే మత్స్య సంపద ఎగుమతి వల్లే వస్తుంది. ఇక పోలవరం నుంచి నరసాపురం బియ్యపుతిప్ప వరకు విస్తరించిన గోదావరిలో దొరికే మత్స్య సంపద కూడా అపారం. జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు నిత్యం ఎగుమతులు జరుగుతుంటాయి. ఇక కొల్లేరు, ఉప్పుటేరు, ఎర్రకాల్వలో కూడా అపారంగా మత్స్య సంపద దొరుకుతుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష మందిపైగా మత్స్యకారులు వేటనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది నేటికి సంప్రదాయ వేటనే అనుసరిస్తున్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సముద్ర వేట సాగించే మత్స్యకారులు మాత్రం మెకనైజ్డ్ బోట్ల ద్వారా వేటాడుతున్నారు.

అంతరించిపోతున్న చేప జాతులు

నదీ జలాల కలుషితం, ఆయిల్ నిక్షేపాల కోసం సముద్రగర్భంలో సాగిస్తున్న అన్వేషణ తదితర కారణాల వల్ల కొన్ని రకాల జాతుల మత్స్య సంపద హరించిపోతోంది. ఉప్పుటేర్లు, గోదావరిలోనూ ఇదే పరిస్థితి. చెరువుల్లోని నీరు ఉప్పుటేర్ల గుండా సముద్రం, గోదావరిలో కలుస్తున్నది. అభివృద్ధి పేరుతో పరిశ్రమలు పుట్టుకు రావడం, అవి వెదజల్లే కాలుష్యంతో నదీ జలాలు కలుషితమై జల పుష్పాలు రోజు రోజుకు హరించి పోతున్నాయి.



ఇంకా సంప్రదాయ వేటలోనే

గతంలో మత్స్యకారులు మాత్రమే వేటాడే వారు. నేడు కార్పొరేట్ సంస్థలు ఈ రంగంలోకి వచ్చాయి. పెద్ద పెద్ద ట్రాలర్లు , హైస్పీడ్ బోట్లను వినియోగించి సముద్ర అడుగుభాగంలో సంచరించే మత్స్య సంపదను టెక్నాలజీని ఉపయోగించి వలలతో బంధిస్తున్నారు. అయితే జిల్లాలోని మత్స్యకారులు మాత్రం ఇంకా సంప్రదాయ పద్ధతిలోనే వేటాడుతున్నారు. పడవలు, వలలతో నదులు, కాల్వలు, ఉప్పుటేర్లలో వేటాడటం వల్ల వీరికి దొరికే మత్స్య సంపద అంతంత మాత్రంగానే ఉంటున్నది. ఇక కడలిలో వేటాడే సోనా బోట్లు హైస్పీడ్ బోట్లు కావు. దీంతో వేటకు వెళ్లినా పుష్కలంగా మత్స్య సంపద చిక్కడం లేదు. దీంతో వీరు అలలకు ఎదురేగి వేటాడుతున్నా తగిన ఫలం దక్కడం లేదు.

వలస బాట

ఉపాధి లేకపోవడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం తదితర కారణాల రీత్యా చాలామంది మత్స్యకారులు వృత్తికి దూరమవుతున్నారు. కొందరు వలసబాట పడుతున్నారు. జిల్లా నుంచి ఏటా రూ.350 కోట్లపైనే మత్స్య సంపద ఎగుమతి అవుతుంది. దీనివల్ల ప్రభుత్వానికి విదేశీ మారకద్రవ్యం వస్తున్నా అందులో మత్స్యకారుల అభివృద్ధికి వెచ్చిస్తున్నది నామమాత్రంగానే ఉంటున్నది. తుపాన్లు, వాయు గుండాలు వచ్చినప్పుడు మత్స్యకారులు ఉపాధికి దూరమవుతున్నారు. ఇలాంటి సమయంలో కూడా ప్రభుత్వం వీరికి అండగా నిలవడం లేదు.

అందని వైద్యం.. నోచుకోని గురుకులాలు

ఇక మత్స్యకారులకు వైద్యం, విద్య కూడా అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. తీర ప్రాంతాల్లో గురుకుల పాఠశాలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప అవి కార్యరూపం దాల్చడం లేదు. ఇటు వైద్యం కూడా వీరికి దూరమైపోతుంది. సాధారణంగా మత్స్యకారులు సముద్ర తీర ప్రాంతాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఏదైనా అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వచ్చేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తీర గ్రామాల్లో కనీసం పీహెచ్‌సీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం లేదు.

సీఆర్‌జెడ్ భూములపై కన్ను

సముద్ర తీర ప్రాంతాల్లో టూరిజం పేరుతో ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహిస్తున్నారు. దీని వల్ల తీర ప్రాంతాలు టూరిజంగా అభివృద్ధి చెందుతున్నాయే తప్ప ఆ భూముల్ని నమ్ముకుని ఉప్పు, చెరువుల్ని సాగు చేసుకుంటు న్న మత్స్యకారులకు మాత్రం ఎటువంటి ప్రయో జనం ఉండటం లేదు. కనీసం ఏర్పాటు చేస్తున్న టూరిజాల్లో వీరికి భాగస్వామ్యం కల్పించడం లేదు. వీరి పిల్లలకు ఉపాధి చూపించడం లేదు.

సంప్రదాయ వేటను పరిరక్షించాలి



జిల్లాలో సంప్రదాయ మత్స్యకారుల సంఖ్యే ఎక్కువ. నేటికీ చాలామంది పడవలు, వలల సాయంతోనే వేట సాగిస్తున్నారు. వీరికి ఆధునిక బోట్ల సాయంతో వేట సాగించేలా ప్రోత్సహించాలి..శిక్షణ ఇవ్వాలి.. సబ్సిడీపై బోట్లు ఇవ్వాలి. మార్కెట్ సదుపాయం, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి.. నదీజలాల కలుషితాన్ని అరికట్టాలి.

- ఆండ్రాజు చల్లారావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు

వేట భృతిని పెంచాలి



వేట విరామం సమయంలో మత్స్యకారులకు ఇస్తున్న భృతిని రూ.20 వేలకు పెంచాలి. ప్రస్తుతం ఈ భృతి కొంత మంది మత్స్యకారులకే అందుతోంది. ఫైబర్, ఇంజన్ బోట్లపై వేట సాగించే మత్స్యకారులకు ఈ భృతిని అందించాలి. ఈ ఏడాది విరామం సమయంలో ఇవ్వాల్సిన భృతి రూ.10 వేలు ఇంత వరకు చెల్లించలేదు.

- మైలా వసంతరావు, జిల్లా మత్స్యకార సంఘం నాయకుడు

పెరగని వేట విరామ భృతి

ఏటా నిత్యావసరాలు ధరలు పైపైకి పెరుగుతున్నాయి. కానీ వేట విరామ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న భృతి మాత్రం పెంచడం లేదు. నేటికి రెండునెలల కాలానికి రూ.10 వేలు ఇస్తున్నారు. నిత్యావసరాలు ఇవ్వడం లేదు. ఈ మొత్తంతోనే కుటుంబ 60 రోజుల పాటు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక డీజిల్ సబ్సిడీ కూడా పెంచడం లేదు, సముద్ర వేట సాగించే మత్స్యకారులకు నెలకు 300 లీటర్ల డీజిల్‌పై సబ్సిడీ ఇస్తున్నారు. అది కూడా లీటర్‌కు రూ.9 మాత్రమే. ఇదే కొన్ని రాష్ట్రాల్లో రూ.20 ఇస్తున్నారు.

భళారే.. బొమ్మ





జీవితంలో భాగంగా మారిన టెలివిజన్

టీవీతోనే తెల్లారుతోంది..

ఒకప్పుడు ఊరికి ఒకటో రెండో..

ఇప్పుడు ఇంటికో టీవీ

సీరియల్స్ లేనిదే మహిళలకు నిద్ర పట్టదు

కార్టూన్స్‌ను పిల్లలు వదలరు

పెద్ద వాళ్లకి భక్తి చానల్స్ పెద్ద రిలాక్స్..

నేడు టెలివిజన్ దినోత్సవం



గుర్తుందా.. ఈ టీవీ

ఒకప్పుడు ఆకాశవాణి రేడియోనే పరిచయం. టెలివిజన్ అంటే ఒక వింత.. వాస్తవానికి 1927 సెప్టెంబరు 7వ తేదీన తొలి ఎలక్ర్టానిక్ టెలివిజన్ ప్రసారం అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో గ్రామ గ్రామాన టెలివిజన్ విస్తరించడానికి మరో అర్ధ శతాబ్దం పట్టింది. రెండు దశాబ్ధాలుగా పల్లెలు, గ్రామాల్లో రంగుల టీవీలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్ ఫోన్లు యువత చేతుల్లోకి వచ్చిన తరువాత టెలివిజన్‌కు కొంత ప్రాధాన్యం తగ్గినప్పటికీ ఇప్పటికీ అధికంగా జన హృదయాలలో పదిలంగా ఉండేది టీవీ మాత్రమే. నేడు టెలివిజన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పాలకొల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నవంబరు 21వ తేదీన టెలివిజన్ దినోత్సవంగా జరుపుకోవడానికి ఐక్యరాజ్య సమితి 1996 డిసెంబరులో ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి టెలివిజన్ దినోత్సవం జరుపుకుంటున్నారు. అదేరోజు ఇంకా పలు ముఖ్యమైన దినోత్సవాలు ఉన్నందున టెలివిజన్ దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ 11 మంది సభ్యులు ఐక్యరాజ్య సమితిలో తీర్మానిం చినప్పటికీ అధిక శాతం మొగ్గు చూపడంతో అప్పటి నుంచి నవంబరు 21వ తేదీన టెలివిజన్ దినోత్సవం జరుపుతున్నారు. వాస్తవానికి స్కాటిష్ దేశానికి చెందిన జాన్ లోహి బైర్డ్ ఫాదర్ ఆఫ్ టెలివిజన్‌గా పిలువ బడ్డారు. బైర్డ్ తొలిసారిగా బ్యాగ్‌లైట్‌కు వ్యతిరేకంగా ప్రతిబింబించే కాంతి ద్వారా 1925లో బైర్డ్ మొట్టమొదటి చిత్రాన్ని ప్రదర్శించారు. ఐతే కిలోటేలర్ 1927 సెప్టెంబరు 7వ తేదీన మొదటి ఎలక్ట్రానిక్ టెలివిజన్ ప్రదర్శించారు

ఇప్పుడు ఒకే ఇంటిలో ఒకే సమయంలో పిల్లులు, వయోజనులు, వృద్ధులు టీవీ చూడాలంటే పోట్లాడుకునే పరిస్థితి వచ్చింది. అందు కేనేమో ఇంటి పెద్దాయన టీవీ సీరియల్స్ చూడటానికి ఒక చిన్న టీవీ... కార్టూన్ నెట్ వర్క్ చూడటానికి చిల్డ్రన్స్ రూమ్‌లో మరో టీవీ, ఇల్లాలు సీరియల్స్‌కి హాల్లో పెద్ద సైజు డిజిటల్ టీవీ ఇలా టీవీలకు ప్రాధాన్యం పెరిగింది.. నాలుగు దశాబ్ధాలకు వెనక్కి వెళితే గ్రామాల్లో బ్లాక్ అండ్ వైట్ టీవీలే ఉండేవి. గ్రామం మొత్తంగా 1, 2 కలర్ టీవీలు ఉంటే గొప్ప విషయమే. ఆ రోజుల్లో కేవలం దూరదర్శన్‌లో శుక్ర, శని వారాల్లో తెలుగు సినిమాలు, ప్రోగ్రామ్‌లు వచ్చేవి. దూరదర్శన్‌లో సినిమా వచ్చే రోజుల్లో టీవీలను అరుగుల మీద పెట్టేవారు. చుట్టుపక్కల పిల్లలు పెద్దలు సమారు 40, 50 మంది అరుగుల మీద కూర్చుని టీవీ చూసేవారు. వారికోసం ఒక బిందెతో మంచి నీరు కూడా ఉంచేవారు. నేడు పరిస్థితులు మారాయి. పేద, గొప్ప తారతమ్యం లేకుండా అన్ని ఇళ్లల్లోనూ టీవీలు ఉంటు న్నాయి. సంపన్నుల ఇళ్ళలో సినిమా థియేటర్లలోని స్ర్కీన్లను తలదన్నేవిధంగా పెద్ద సైజు టీవీలు ఉంటున్నాయి. ఒకప్పుడు టెలివిజన్ కేవలం వినోదానికే అయితే, ఇప్పుడు విజ్ఞానానికే ఉపయోగపడుతోంది.. టెలివిజన్ వీక్షకులలో సృజనాత్మకత పెంచుతుంది. పలు చానల్స్‌లో జ్ఞానాన్ని అందిస్తున్నాయి. వృద్ధులకు కాలక్షేప సాధనంగా ఉపయోగపడుతోంది. టెలివిజన్ ద్వారా వివిధ ప్రాంతాలు, దేశాల సంస్కృతిని తెలుసుకోవడమే కాకుండా వివిధ భాషలను నేర్చుకునే అవకాశం కూడా ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే టెలివిజన్ కనిపెట్టిన వ్యక్తి తన పిల్లలను టీవీ చూడనివ్వ లేదట. టెలివిజన్‌లో విలువైనది ఏమీ లేదని అతను చెప్పడం గమనార్హం.

మన దేశంలో 1959లో సెప్టెంబరు 15న తొలి టీవీ ప్రసారాలు ప్రయోగాత్మకంగ ప్రారంభమయ్యాయి. అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ టెలివిజన్ కార్యక్రమాల్ని ప్రారంభించారు. టెలివిజన్ ఇండియా పేరుతో రోజుకి అరగంట.. అదీ వారానికి మూడు రోజులు మాత్రమే ప్రసారమయ్యేవి. 1965 సంవత్సరం నుంచి కార్యక్రమాలు ప్రతిరోజు ప్రసారాలు చేసేవారు. 1975లో దేశంలోని 6 రాష్ట్రాలలో కమ్యూనిటీ టెలివిజన్ సెట్లు ఏర్పాటు చేశారు. మొదట్లో ఆల్ ఇండియా రేడియోలో భాగంగా దూరదర్శన్ పనిచేసేది. 1976లో దూరదర్శన్ రేడియో నుంచి విడిపోయింది. 1982లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారంతో భారతదేశంలో కలర్ టెలివిజన్ ప్రారంభమైంది.

సీరియల్స్‌తో కాలక్షేపం...



రాజకీయాల్లో రిటైర్ అయ్యాను. ప్రస్తుతం సీరియల్స్ జీవితంలో ఒక భాగం అయ్యాయి. టీవీలో న్యూస్‌తో పాటు సీరియల్స్ కాస్త వినోదాన్ని ఇస్తున్నాయి. నావంటి రాజకీయ నిరుద్యోగులకు వృద్ధాప్యంలో ఉన్నవారికి టీవీలే పెద్ద కాలక్షేపం.

చేగొండి హరిరామ జోగయ్య, మాజీ ఎంపీ, పాలకొల్లు

చిత్రలహరి కోసం..

పోలవరం : ఇప్పుడు మనం ఎప్పుడు కోరుకుంటే అప్పుడు వినోదాన్ని కావలిసిన భాషలో అందించే ఛానళ్ళు అనేకం ఉన్నాయి.. రిమోట్‌లో చానళ్లు మారుస్తూ 24 గంటలూ టీవీలకు అతుక్కుపోయి చూసేలా నిరంతర కాలక్షేపానికి లోటులేని రోజులివి. కానీ 65 సంవత్సరాల క్రితం సినిమా తప్ప ఎలాంటి ఎంటర్ టైన్‌మెంట్ లేని రోజుల్లో.. ప్రజలకు దృశ్య, శ్రవణ భాగ్యాలను కలిగించింది టెలివిజన్. గ్రామాల్లో మోతుబరులు, భూస్వాములు, జమిందారుల ఇళ్ళలోనే టీవీలు ఉండేవి. ప్రజలు చూసే విధంగా ఇంటి అరుగుపైనో గ్రామ చావిడిలోనో టీవీలు ఏర్పాటు చేసేవారు. గుండమ్మ కథ చిత్ర టైటిల్ సాంగ్ సంగీతంతో మొదలయ్యే చిత్రలహరి కార్యక్రమం, హిందీ సినిమా పాటల చిత్రహార్, రామాయణం, మహాభారతం, మాల్గుడి కథలు చూసేందుకు పెద్దలు, పిల్లలు, మహిళలు ముందుగానే వంటా వార్పు కార్యక్రమాలు పూర్తిచేసుకుని టీవీ ముందు చతికిలపడేవారు. ప్రతి శుక్రవారం చిత్రలహరి కార్యక్రమంలో ప్రసారం చేసే ఆరు పాటల కోసం సాయంత్రం 7 గంటలకే టీవీల ముందు పడిగాపులు కాసేవారు. చిత్రలహరి తర్వాత ఆ సినిమా పాటల మీద చర్చలు ప్రారంభించేవారు. 7 గంట లకు వచ్చే తెలుగు వార్తల కోసం పెద్దలు ఎదురు చూసేవారు. శనివారం ఆదివారాలు వస్తే సినిమాల కోసం ముందుగానే చాపలు, గోనెసంచులతో టీవీ ఉన్న ప్రాంతానికి గుంపులుగా తరలి వెళ్ళేవారు.

రాత్రయ్యేసరికి ఇంటికి చేరేవాళ్లం..



అప్పట్లో రోజంతా కాయకష్టం చేసుకుని సాయంత్రం అయ్యేసరికి వంట పూర్తిచేసుకుని టీవీలో వచ్చే కార్యక్రమాలు చూసుకుని ఇంటికి వచ్చేవాళ్ళం. పోలవరంలో 1984లో హెడ్మాస్టర్ రత్నా బాయి, బెల్లం వ్యాపారి దండు రాజు నివాసాల వద్ద టీవీలు ఉండేవి. ఇందిరా గాంధీ చని పోయినపుడు అంతిమ యాత్ర టీవీల్లోనే చూశాం.

- జయవరపు రామాయమ్మ, పోలవరం

ఆ రోజుల్లో.. అరుగు నిండిపోయేది



పాలకోడేరు : ఒకప్పుడు ఇంట్లో రేడియో, టేప్ రికార్డర్ ఉంటే చాలు ఎంతో ఆనందంగా ఉల్లాసంగా గడిపేవారు. అవి ఉంటేనే గొప్పగా చెప్పుకునేవారు. తర్వాత టెలివిజన్ వచ్చింది. ఊరుకో టీవీ ఉంటే ఎంతో ఆశ్చర్యంగా గొప్పగా చెప్పుకునేవారు. శుక్రవారం వచ్చిందంటే సినిమా పాటల కోసం ఓ గంట ముందే ఆ పేట వాసులంతా ఇంటి ముందు వాలిపోయేవారు. ఆది వారం వచ్చిందంటే ఇంకా సందడి. ఆ టీవీలో వచ్చే సినిమా చూసేందుకు ఎంతో ఆసక్తి కనపరిచేవారు.శుక్రవారం చిత్రలహరి, శనివారం హిందీ సినిమా, ఆదివారం తెలుగు సినిమా కోసం టీవీల వద్ద అతుక్కుపోతూ ఉండేవారంటే అతిశయోక్తికాదు. అలా ప్రతీ గ్రామంలోను ఒకరిద్దరికి మాత్రమే టీవీలు ఉండేవి. ఇంటి యాజమానులు సైతం శుక్రవారం వచ్చినా, ఆదివారం వచ్చినా పనులు ముందు గానే చక్కదిద్దుకుని జనం టీవీ చూసే విధంగా ఏర్పాట్లు కూడా చేసేవారు. మధ్యమధ్యలో టీవీ రాకపోతే యాంటీనా మార్చుతూ ఎన్నో తిప్పలు పడేవారు. ఆ రోజులు తలచుకుంటే భలే తమాషాగా ఉంటాయి.

మా ఊళ్లో రెండో.. మూడో ఉండేవి



సుమారు 50 సంవత్సరాల క్రితం మా ఊళ్ళో రెండు మూడు టీవీలు మాత్రమే ఉండేవి. శుక్రవారం ఆదివారం వచ్చిందంటే ముందుగానే ఇంట్లో పని చేసుకోవాల్సి వచ్చేది. టీవీ చూసేందుకు ఆ వీధిలో ఉన్న చిన్నా, పెద్దా ఇంటికొచ్చి గంట ముందే కుర్చునిపోయేవారు. చిత్రలహరి తెలుగు సినిమా చూసేందుకు ఎగబడేవారు. ఆ సందడే వేరు..

-మరపట్ల వరప్రసాదరావు, గొల్లలకోడేరు

వచ్చేవారికి అన్ని వసతులు కల్పించేవాళ్లం




ఆ రోజుల్లో ఎవరికో కానీ టీవీలు ఉండేవి కావు. టీవీ ఉందంటే పెద్దగొప్పే. టీవీలో పాటలు,సినిమా చూసేందుకు అందరూ ఆసక్తి కనపరిచేవారు. శుక్రవారం, ఆదివారం ఎప్పుడు వస్తుందా ఎదురు చూసేవారు. ఇంటికి వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా టీవీలను బయట ఏర్పాటు చేసి వారు కూర్చునేందుకు చాపలు పరిచేవాళ్ళం. కానీ ఎటువంటి విసుగు ఉండేది కాదు. ఆ రోజులు తలచుకుంటుంటే విచిత్రం వేస్తుంది.

- ఆదాడ నరసింహారావు, పెన్నాడ



శివస్వామికి కారంతో అభిషేకం

ద్వారకాతిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్యంగిరిదేవి ఉపాసకుడు శివ స్వామికి కారంతో నిర్వహించిన అభిషేకం భక్తులను అబ్బురపరిచింది. దొరసాని పాడులోని శ్రీశివ దత్తాత్రేయ ప్రత్యంగిరి వృద్ధాశ్రమం వద్ద బుధవారం సాయంత్రం గణపతిపూజ, దీక్షాదారణ, శ్రీమహా పూర్ణాహుతి నిర్వహించారు. ఉపాసకుడైన శివస్వామిని భక్తులు పెద్ద ఎత్తున కారంతో అభిషేకించారు. ప్రత్యంగిరి అమ్మవారికి కారం అంటే ఎంతో ప్రీతి పాత్రమని అందుకే అమ్మవారిని ఆవాహన చేసుకున్న శివస్వామిని కారంతో అభిషేకించినట్టు నిర్వాహకులు తెలిపారు.



సైకిల్‌పై శబరిమలకు..

మొగల్తూరు, నవంబరు 20,(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలలు వేసుకున్న స్వాములు బుధవారం సైకిల్‌పై బయలుదేరారు. ముత్యాలపల్లికి చెందిన వెంకటేశ్వర్లు గురుస్వామి ఆధ్వర్యంలో యుగంధర్ స్వామి పర్యవేక్షణలో సుమారు 11 మంది గ్రామదేవత బండి ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ఇరుముడులు దరించి సైకిళ్లపై యాత్రగా బయలుదేరారు.



మావుళ్లమ్మ ఆలయానికి ఐఎస్‌వో సర్టిఫికెట్టు

భీమవరం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయానికి ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం అందించారని దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. మావుళ్లమ్మకి విశేషమైన చరిత్ర ఉందని 12 ఏళ్ళ పైబడి నాణ్యమైన ఆహారాన్ని భక్తులకు అన్నదాన వితరణ చేస్తున్నామని, .ఆలయ నాణ్యతను విచారించి ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారని తెలిపారు. బుధవారం ఈవో నగేష్, ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మలకు సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి, సత్య సాయిబాబా సంబంధిత పత్రాలను అందించారు.

ఫుడ్ పాయిజన్

» వికటించిన మధ్యాహ్న భోజనం » తొమ్మిది మంది విద్యార్థులకు అస్వస్థత » ఏలూరు ఆస్పత్రికి తరలింపు » విద్యార్థులకు ఎమ్మెల్యే చింతమనేని పరామర్శ » జోగన్నపాలెం పాఠశాలలో ఘటన



ఆస్పత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జోగన్నపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం చేసిన తరువాత తొమ్మిది మంది విద్యార్థులకు వాంతులు, కడుపు నొప్పి రావడంతో గోపన్నపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న దెందులూరు తహసీల్దార్ సుమతి వచ్చి వారిని పరామర్శించి కలెక్టర్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే డీఎంఅండ్‌హెచ్‌వో షర్మిష్ఠ వచ్చి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రికి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. ఆ తర్వాత విద్యార్థులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈసందర్భంగా జోగన్నపాలెం పాఠశాలలో తాగునీరు, ఆహార పదార్థాలను ల్యాబ్‌కు టెస్టింగ్‌కు పంపించారు. ఫుడ్ పాయిజనింగ్ అవడం వలన విద్యార్థులకు కడుపు నొప్పి, వాంతులు అయి ఉండవచ్చని డీఅండ్‌హెచ్‌ఎం మీడియాకు తెలిపారు. పాఠశాలలో భోజనం చేసిన మిగిలిన 11 మంది విద్యార్థులను సైతం వైద్యసిబ్బంది గ్రామంలో రాత్రి పర్యవేక్షలో ఉంచారు. దీనిపై విచారణ చేయాలని ఎమ్మెల్యే చింతమనేని అధికారులను ఆదేశించారు.

ఏలూరు క్రైం: పిల్లలు అందరు ఆరోగ్యంగానే ఉన్నారని ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితులు లేవని ఏలూరు ఆస్పత్రి వైద్యులు స్పష్టం చేశారు. దీంతో తల్లి దండ్రులు తమ బిడ్డల వద్దే ఉంటూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకున్నారు. ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఆసుపత్రికి వచ్చి విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

అసెంబ్లీ వాయిస్

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే ఆరిమిల్లి



తణుకు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్మిక సంక్షేమ బోర్డు సేకరించిన నిధులు ఎన్ని ఉండాలి, ఎన్ని ఉన్నాయని, ఇతర పథకాలకు నిధులు మళ్ళింపు చేశారా అని కార్మిక మంత్రిని ప్రశ్నించారు. 2019లో జగన్ ప్రభుత్వం పూర్తిగా బోర్డును నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కనీసం క్లెయిమ్‌లు కూడా పరిష్కరించలేదన్నారు.

పొలాల ముంపు నివారించండి

ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరంలోని ఏడు గ్రామాల రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయని, మొదటి క్రాప్ చేయకపోతున్నారని, రూ.2 కోట్లతో వంతెన పూర్తి చేస్తే 7 గ్రామాల రైతులు వ్యవసాయం చేసుకుంటారని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. భీమవరం - నరసాపురం వెళ్లే దారిలో తుక్కోడు డ్రెయిన్ ఉందని, అటువైపు దారిలో చిన్న చిన్న పైపులైన్ వేసి మూసి వేయడంతో తూడు ఇబ్బందితో మురుగునీరు బయటకి వెళ్లడం లేదని, గత 10 ఏళ్లుగా ఈ అంశంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తూనే ఉన్నానని, రూ.2 కోట్లతో వంతెన పూర్తి చేస్తే ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. వంతెన పూర్తయితే ఏడు గ్రామాల రైతులు వ్యవసాయం చేయడానికి ముంపు పోతుందని, సుమారు 4వేల ఎకరాల ఆయకట్టుకు సాగు చేసుకోవడానికి ఉపయోగపడుతుందని దీనిపై మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు.

జడ్పీ సీఈవో ఎఫ్ఏసీగా విజయరాజు బాధ్యతల స్వీకరణ



ఏలూరుసిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సీఈవో ఎఫ్ఏసీగా ఏలూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కెఎస్‌ఎస్ సుబ్బారావు వ్యక్తిగత పనులపై ఈనెల 20వ తేదీ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు సెలవుపై వెళ్ళటంతో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు జడ్పీ సీఈఓ ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ సీఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించిన ఆర్.విజయరాజును జడ్పీ ఉద్యోగులు, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు అభినందించారు.



సిద్ధాంతం ర్యాంప్ వద్ద నిరసన తెలుపుతున్న ట్రాక్టర్‌ల యజమానులు

నడిపూడి ర్యాంప్‌లో అక్రమ తవ్వకాలు

పెనుగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం నడిపూడి ఇసుక ర్యాంప్‌లో అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఉచిత ఇసుక విధానం పేరుతో దళారులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. లారీల నుంచి అక్రమార్కులు రూ.3 వేలు నుంచి రూ. 4 వేలు వరకు తీసుకుని దండిగా దండుకుంటున్నారు. గత రాత్రి నుంచి వందల సంఖ్యలో లారీలతో దళారులు తీరాన్ని దోచేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్‌లకు లోడింగ్ చేయాలి

ఇసుక రీచ్‌లో ట్రాక్టర్‌ల ద్వారా ఎవరైనా ఇసుక ఉచితంగా తీసుకు వెళ్ళవచ్చని చెబుతున్నా తమకు వేయడం లేదని ట్రాక్టర్‌ల ఓనర్లు సిద్ధాంతం ఇసుక ర్యాంప్ సమీపంలో బుధవారం రాత్రి కాసేపు లారీలను అడ్డుకున్నారు. ట్రాక్టర్‌లకు కూడా లోడింగ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో మంతనాల తరువాత లారీలను వదిలేశారు.



నడిపూడి ఇసుక ర్యాంప్ నుంచి వస్తున్న లారీలు

అనుమతులు లేవు: తహసీల్దార్

ప్రస్తుతం నడిపూడి ఇసుక ర్యాంప్‌లో తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని పెనుగొండ తహసీల్దార్ అనిత కుమారి తెలిపారు.

మెరిసేదంతా.. వెండి కాదు!



» చాలా వస్తువుల్లో సగం శాతమే వెండి » మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు విక్రయాలు » ఆరా తీయకుండా కొనుగోళ్లు » ధర లక్షకు చేరడంతో వెలుగు చూస్తున్న మోసాలు » కొనేటప్పుడు ఎంత శాతం వెండి ఉందో అడగాలి: వ్యాపారులు

నరసాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేజీ వెండి ధర రూ.లక్ష దాటింది. దీంతో ఓ వ్యక్తి తన దగ్గర ఉన్న మూడు కేజీల వెండిని విక్రయించాలని మార్కెట్‌కు వచ్చాడు. తరుగు పోను.. కనీసం రూ.2.60లక్షల వరకు వస్తుందని అంచనా వేశాడు. అయితే ఆ వస్తువుల్ని పరిశీలించిన బులియన్ వ్యాపారి ఇందులో వెండి శాతం తక్కువగా ఉందని చెప్పడంతో ఆ కస్టమర్ షాక్ తిన్నాడు. ఇలా ఒకరూ కాదు.. ఇద్దరు కాదు.. చాలా మంది పెరిగిన వెండి ధరలను చూసి తమ దగ్గర ఉన్న వెండి కూడా అంతే ధర ఉంటుందని లెక్కలు కట్టుకుంటారు. ఇలా భావిస్తే మీరు పొరపడినట్లే. బంగారానికి మేలిన, 22 క్యారెట్లు, ఆర్నమెంట్ బంగారం అని ఎలా ఉంటుందో.... వెండికి కూడా ఇలాగే ఉంటుంది. అయితే ఇది శాతంలో ఉంటుంది. వస్తువుల్లో ఎంత శాతం వెండి ఉందో అన్న విషయాన్ని ఆరా తీసి కొనుగోలు చేయాలి. కొన్ని వస్తువుల్లో 85శాతం వెండి ఉంటుంది. మరికొన్నింటిల్లో 75, 65, 55, 45శాతం కూడా ఉంటుంది. అయితే ఈ వస్తువులన్ని మేలిన వెండి వస్తువుల వల్లే దగదగ మెరిసిపోతాయి. ఇలా తెలుసుకోకుండా మార్కెట్‌లో కేజీ వెండి రూ.లక్ష ఉన్న కొందరు వ్యాపారులు తక్కువ ధరకు విక్రయిస్తారు. ఇలాంటి సమయంలో ఆ వస్తువులో ఎంత శాతం వెండి ఉందో అన్న విషయాన్ని కస్టమర్లకు చెప్పరు. ఇలాంటి వస్తువుల్ని కొంటే మోసపోయినట్లే. పట్టీల దగ్గర నుంచి గ్లాసు, చెంబు, కంచం ఇలా ఏ వస్తువు చూసినా.. అందులో నూరుశాతం వెండి ఉండదు. 90శాతం వెండి వస్తువులు కావాలంటే తయారు చేయించి ఇస్తారు, దీనికి తరుగు, మజూరి తీసుకుంటారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న ఏ వెండి వస్తువు కొన్నా తరుగు, మజూరి ఉండదు. ఇక్కడే అసలు మోసం ఉంది.

జిల్లాలో కోట్లలో వ్యాపారం....

జిల్లా పసిడి, వెండి మార్కెట్‌కు ప్రసిద్ధి. నిత్యం కోట్లల్లో వ్యాపారం జరుగుతుంది. అందులో అత్యధికంగా వెండి వస్తువులే అమ్మకాలు జరుగుతుంటాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 700 పైగా వెండి విక్రయ దుకాణాలు ఉన్నాయి. పేరుకు జ్యూయలరీ షాపులు అయినప్పటికీ ఎక్కువ అమ్మకాలు వెండి వస్తువులే ఉంటాయి. బంగారాన్ని చాలా మంది కాసు, అరకాసు, గ్రాముల్లో కొని దాచుకుంటారు. డబ్బులు ఉన్నప్పుడల్లా బంగారం మీద పెట్టుబడి పెడతారు. వెండి మీద ఇలా పెట్టుబడి పెట్టేవారి సంఖ్య తక్కువ. ఎందుకంటే వెండి కేజీల్లో ఉంటుంది. దీంతో ఎక్కువ మంది వస్తువులనే కొనుగోలు చేస్తుంటారు.

తక్కువ శాతం వెండితో రంగు మార్పు

సాధారణంగా వెండి వస్తువుల్ని కొనుగోలు చేసి వాటిని బీరువాలో భద్రపరుస్తారు. కొందరు బ్యాంకు లాకర్‌లో దాచుకుంటారు. పూజలు, ఇంట్లో ఏదైన శుభకార్యక్రమాలు జరిగినప్పుడు వాటిని బయటకు తీస్తారు. ఇలా తీసినప్పుడు వాటి రంగు బయటపడుతుంది. తక్కువ శాతం వెండి ఉన్నవస్తువులు కొద్దికాలానికే నల్లబడతాయి. అయితే కొద్ది మంది వెంటనే వెళ్లి వ్యాపారిని నిలదీస్తారు. అలాంటి సమయంలో కొందరు వాటికి పాలిష్ పెట్టి ఇస్తుంటారు. అయితే చాలా మంది వెండి నల్లబడటం సాధారణ మనుకుని సరిపుచ్చుకుంటారు. చింతపండు, పెస్టు, కొల్‌గేట్ పౌడర్‌లతో కడుగుతారు. ఇలా వాష్ చేయగానే అవి మళ్లీ మెరిసిపోతాయి. అంతేగాని వాటిలో ఉన్న వెండి శాతం గురించి ఆరా తీయరు. ఒకవేళ అమ్మినప్పుడే వాటిని కరిగిస్తారు. ఇలాంటి సమయంలోనే అందులో ఉన్న వెండి నాణ్యత బయటపడుతుంది.

అడిగి కొనుగోలు చేయాలి



మార్కెట్ ధర కంటే తక్కువకు వస్తువులు వస్తున్నాయని ఆశపడి కొనుగోలు చేయకూడదు. కేజీ వెండి లక్ష ఉన్నప్పుడే రూ.60వేలకు వస్తువులు ఎలా ఇస్తున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలి. నమ్మకం ఉన్న షాపుల్లోనే కొనుగోలు చేసుకోవాలి. కొనే ముందు ఒకటి రెండు సార్లు వెండి శాతంపై ఆరా తీయాలి. అప్పుడే వ్యాపారీ ఖచ్చితంగా చెబుతాడు. తిరిగి వస్తువులు అమ్మేటప్పుడు కూడా కొన్న రేటు వస్తుంది.

- వినోద్ కుమార్ జైన్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పెంటపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం ప్రత్తిపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన గట్టు నాగేశ్వరరావు(19) తాడేపల్లిగూడెం ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెంకండ్ ఇయర్ చదువుతున్నాడు. హాల్‌టికెట్ తీసుకునేందుకు తన స్నేహితుడితో కలిసి తాడేపల్లిగూడెం వస్తుండంగా ప్రత్తిపాడు ఫుడ్ ప్యాక్స్ కర్మాగారం వద్ద సరుకులోడు చేసుకునేందుకు వెళ్తున్న లారీ ఒక్క సారిగా షడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న నాగేశ్వరావు లారీని మోటార్ సైకిల్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితునికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుని తండ్రి దుర్గారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వామి కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాదంపూడి సమీపంలో రైలు ఢీకొని 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్సై పి.అప్పారావు తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు ఢీకొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదని మృతుడు నలుపు, తెలుపు రంగు నిలువు అడ్డుచారలు గల హాఫ్ హ్యాండ్ చొక్కా, పింక్ కలర్ జాకెట్, బ్రౌన్ కలర్ కాటన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకి తెలిసిన వారు 964091 10567కు సమాచారం అందించాలని కోరారు. మృతదేహం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురి గదిలో ఉంచినట్టు తెలిపారు.

చికిత్సపొందుతూ రైతు మృతి

లింగపాలెం, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): నాగలి కట్టే సమయంలో ఎద్దు పొడవటంతో యువ రైతు మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కే గోకవరం శివారు పాచ్చానగరం గ్రామానికి చెందిన దాసరి ప్రసాద్ (40) ఈ నెల12వ తేదీన పొలంలో నాగలి కడుతుండగా ఎద్దు పొడవటంతో తీవ్రగాయాలపాలైనట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ వృద్ధుడు మృతి చెందాడని ఆ మృతుని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన ఘటన తాడేపల్లిగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. మృతుని బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామచంద్రరావుపేటకు చెందిన మేకల రామకృష్ణ అనారోగ్యం పాలవడంతో బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ఆ వృద్ధుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రామకృష్ణ మృతి చెందాడని ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరువాత కొంత సేపటికి బంధువులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిపోవడంతో గొడవ సద్దుమణిగింది.

దైవ దర్శనానికి వెళుతూ ప్రమాదం

భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం





లక్ష్మణరావు (ఫైల్), అపస్మారకస్థితిలో రమాదేవి

జంగారెడ్డిగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్తున్న భార్యాభర్తల ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో భర్త సవరం లక్ష్మణరావు (58) మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా మారిన ఘటన బుధవారం జంగారెడ్డిగూడెంలో జరిగింది. గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జరిగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనడానికి జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సవరం లక్ష్మణరావు (58) తన భార్య రమాదేవితో కలిసి ద్విచక్ర వాహనంపై స్థానిక సాయిబాబా గుడి రోడ్డు నుంచి బైపాస్ రోడ్డుకు ఎక్కుతుండగా వరంగల్ నుంచి కాకినాడకు వెళ్తున్న లారీ అతి వేగంగావస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో లక్ష్మణరావు (58) ప్రమాద స్థలంలోనే మృతి చెందా డు. మృతుని భార్య రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆమెను పోలీసులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అపస్మారక స్థితిలో ఉందని బంధువులు తెలిపారు.

బజ్జీల బండితో జీవనం

లక్ష్మణరావు స్థానిక పేరంపేట రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె లావణ్యను ఏలూరు ఇచ్చి వివాహం చేశారు. కుమారుడు నవీన్ కుమార్‌ను రెండు నెలల క్రితమే ఉన్నత చదువుల కోసం అమెరికా పంపించారు.

స్కూల్‌బస్సు బోల్తా ఒకరి మృతి

తణుకు, నవంబరు 20: తణుకు జాతీయ రహదారి డీమార్టు సమీపంలో స్కూలు బస్సు అదుపు తప్పి బోల్తా కొట్టింది. బుధవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. స్కూలు పిల్లలను తీసుకురావడానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సులో పిల్లలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. బస్సు పెరవలి మండలం ముక్కామల నుంచి విద్యార్థులను తీసుకొచ్చేందుకు వెళుతున్నది. మార్గ మధ్యలో స్టెప్పింగ్ స్టోన్ స్కూలుకు చెందిన క్లీనర్ మేళం ప్రవీణ్ లిఫ్టు అడిగి ఎక్కి మృతి చెందాడు. బోల్తా కొట్టిన బస్సు డ్రైవరు, క్లీనర్‌లు సురక్షితంగా బయట పడ్డారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై కుటుంబానికి దూరమై జీవితంపై విరక్తి చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధి గౌరీ దేవి గుడి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ సజన (37)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గోనెసంచుల పనికి వెళ్తూ ఉంటాడు. అతని భార్యతో మనస్పర్థలు రావడంతో కొంత కాలం క్రితం ఆమె పుట్టింటికి పిల్లలను తీసుకుని వెళ్ళిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న సజన జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధ రాత్రి దాటిన తరువాత ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం ఇరుగుపొరువారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని తల్లి షేక్ వకలాబి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చైన్ స్నాచింగ్

భీమవరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దంపతులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గ మధ్యలో పల్సర్ బైక్‌పై ఇద్దరు దుండగులు వచ్చి మహిళ మెడలో బంగారు తాడును లాక్కుని పరారయ్యారు. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం తాడేరు రోడ్డులో టిడ్కో నివాసాల్లో ఉంటున్న జవ్వాది వరలక్ష్మి అనారోగ్యంగా ఉండటంతో ఎస్పీ స్ట్రీట్‌లో ఉంటున్న తన సోదరుడు ఇంటికి వెళ్ళింది. అక్కడ వైద్యం పొందిన తరువాత ఈనెల 19వ తేదీన తన నివాసానికి భర్తతో కలిసి రాత్రి 9గంటల సమయంలో వెళుతుండగా తాడేరు రోడ్డులో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పల్సర్ బైక్‌పై వెంబడించారు. అందులో వెనుక కూర్చున్న వ్యక్తి బైక్ దిగి వరలక్ష్మి మెడలో ఉన్న 5 కాసులు బంగారు తాడును లాక్కుని పరారయ్యారు.

135 సెల్‌ఫోన్ల రికవరీ.. బాధితులకు అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 20 లక్షల రూపాయల విలువైన 135 మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇంటి వద్దనే కూర్చొని 9154966503 వాట్సప్ నెంబర్‌కి హాయ్ లేదా హెల్ప్ అని మేసేజ్ చేసి, వచ్చిన లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు నింపితే చాలు పోగొట్టుకున్న మీ మొబైల్‌ని రికవరీ చేసి మీకు అందిస్తామన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఇటీవల చోరీకి గురైన లేక పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు 8వ విడత సెల్‌ఫోన్స్ రికవరీ, పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నయీం అస్మి చేతుల మీదుగా 135 మొబైల్ ఫోన్లను సంబంధిత వ్యక్తులకు అందజేశారు. మొబైల్ ఫోన్లును రికవరీ చేసి బాధితులకు అందించడంలో కృషి చేసిన మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ అహ్మద్ ఉన్నిషా, ఎస్ఐ నాగేశ్వరరావు ఐటీ కోర్ కానిస్టేబుల్ ఎస్.భాస్కర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 1239 సెల్‌ఫోన్‌ల రికవరీ చేశామని, వీటి విలువ 1,85,85,000 రూపాయలు ఉంటుందని అన్నారు

పాత నేరస్తుడి అరెస్టు

13కాసుల బంగారం స్వాధీనం



నిందితుడిని అరెస్టు చేసి వివరాలు చెబుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

పాలకొల్లు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న పూలపల్లికి చెందిన కట్టా సుబ్బారావు అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 13 కాసుల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్టు పాలకొల్లు రూరల్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. సీఐ తన కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోడూరు స్టేషన్ పరిధిలో 2 కేసులు, పాలకొల్లు రూరల్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో విచారణ చేయగా సీసీ ఫుటేజ్ ఆధారంగా పోడూరు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. నిందితుడిపై ఇంకా 40 దొంగతనాలు కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితుడిని పట్టుకో వడంలో సహకరించిన హెడ్ కానిస్టేబుల్ రమేష్, ఐడి పార్టీ పీసీలు బొక్కా బాలాజీ, కె.ప్రసాద్‌లను సీఐ శ్రీనివాస్ అభినందించారు

గుమస్తానే అసలు నిందితుడు

అపహరణకుగురైన బంగారం నగదు స్వాధీనం

నిడదవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగారు నగల షాపు నుంచి బంగారం నగదు తీసుకువెళు తున్న గుమస్తా దురుద్దేశంతో గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడిచేసి దోచుకుపోయారని షాపు యజమానిని నమ్మించగా ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన సంఘటన నిడదవోలులో చోటుచేసుకుంది. ఈ మేరకు బుధవారం నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిలక్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈనెల 14వ తేదీన తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం బంగారు నగల షాపుకు తీసుకువెళ్లేందుకు అమర్ అనే వ్యక్తికి షాపు యజ మాని 289.340 గ్రాముల బంగారు ముక్కలను 6,30,000 రూపాయల నగదును ఇచ్చి రాజమండ్రి లోని బంగారు నగల దుకాణానికి పంపగా ఇతను నిడదవోలు వచ్చేసరికి శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయం పొదల్లో డబ్బు బంగారం దాచి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి తన వద్ద ఉన్న బంగారం, నగదు దోచుకుపోయారని యజమానికి చెప్పాడు. దీనిపై నిడదవోలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా అమర్ దురు ద్దేశంతో పథకం ప్రకారం బంగారం నగదు దాచి దొంగతనం డ్రామాకు తెరలేపాడని తెలిపారు. అమర్‌ను అరెస్ట్‌చేసి అతను దాచిన 289.340 గ్రాములు బంగారం ముక్కలు 6,30,000 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలి పారు.



పోలీసులు రికవరీ చేసిన నగదు, బంగారం

సమస్యలు.. ధర్నాల హోరు



నగరపాలక సంస్థ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులు

ఏలూరుటూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం ధర్నా చేశారు. కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, పనిముట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈఎస్ఐ కార్డులు సరఫరా చేయాలన్నారు. చనిపోయిన కార్మికులకు రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియా, వారసులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. క్లాప్ ఆటోడ్రైవర్లకు బకాయి జీతాలివ్వాలన్నారు. అనంతరం కమిషనర్ భానుప్రతాప్‌కు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన భానుప్రతాప్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జాన్‌బాబు, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మునిసిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్ల కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు వెలగాటి అనురాధ, వి.బాలు, సాయమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల జీతాలు పెంచాలి

కుక్కునూరు: పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న హమాలీలకు ప్రతీ రెండేళ్లకు జీతాలు పెంచుతామని ఒప్పందం చేసుకున్నప్పటికీ అమలు కాలేదని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఒప్పందకాలం పూర్తయి 11నెలలైనా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. హమాలి వర్కర్లు మండల స్టాక్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం, నిత్యావసరాలు చేరవేయడానికి పని చేస్తున్నప్పటికి వారికి జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్, సురేష్, తిరుపతయ్య, గరటం శ్రీను, వెంకట్రావు, తదితరులుపాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు..

ఏలూరు క్రైం: ఆర్టీసీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అమరావతి జేఏసీ అధ్యక్షుడు రమేష్ హెచ్చరించారు. ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ఉదయం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో 2012 నుంచి ఇప్పటి వరకూ ఒక్క పల్లెవెలుగు కూడా కొనుగోలు చేయలేదని, ఉద్యోగుల నియామకాలు చేపట్టలేదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిక్ లీవుల బిల్లులు మంజూరు చేయాలన్నారు. డిపో ఎదురు గాకార్మికులు నినాదాలు చేసి తమ నిరసనను తెలియజేశారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు రూరల్: జిల్లాలో అక్రమంగా తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరెట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎప్పటి నుంచో విధులు నిర్వహిస్తున్న వీవోఏలను రాజకీయ వేధింపులకు గురి చేస్తూ అక్రమంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కె.విజయలక్ష్మి, మరియమ్మ, ఏసురత్నం, రమాదేవి, గ్రేసి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

రైతు సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరెట్ వద్ద ధర్నా నిర్వహించారు. రైతులకు సాగు రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో కురెళ్ల ప్రసాద్, నాగం అచ్యుత్, తెర్లాపు శ్రీను, హకీమ్, లక్ష్మిభవాని, పుల్లయ్య, సురేష్‌రెడ్డి, గంగమ్మ, అరుణ, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మహేశ్ యాదవ్


మహేశ్ యాదవ్‌ను అభినందిస్తున్న చింతమనేని

దెందులూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దెందులూరుకు చెందిన తెలుగు విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పెనుబోయిన మహేశ్ యాదవ్ నియమితులయ్యారు. తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దెందులూరులో పలువురు మండల టీడీపీ నాయకులు, యాదవ సంఘ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు,

మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా దాసరి



ఏలూరు టూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు ఎన్నికయ్యారు. దాసరి నియామకంపై టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలలు, మహిళల రక్షణకు 'అభయ' : డీఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలల రక్షణకు అభయ మహిళ రక్షక దళం పనిచేస్తుందని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. పోలసానపల్లి, అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మహిళల భద్రత అభయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులకు అభయ మహిళా రక్షక దళం మహిళల రక్షణ కోసం పనిచేస్తుందని దీనిపై విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకో వాలన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్సు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పలు చట్టాలు మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఇతర నేరాలపై రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా ఎస్ఐ కాంతిప్రియ, రాష్ట్ర చైల్డ్‌రైట్స్ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ఎస్ఐ సుధాకార్, సీడీపీవో విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల రక్షణ చట్టంపై అవగాహన

బుట్టాయగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు చట్టరీత్యా రక్షణ చర్యలు తెలియజేయడానికి అవగాహన సదస్సుల నిర్వహిస్తున్నట్లు సీఐడీ డీఎస్పీ వై.శ్రీనివాసరావు అన్నారు. ఎస్సీ ఎస్టీలపై దాడులు, రక్షణ అంశాలపై ఐటీడీఏలో బుధవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో అరెస్టులు జరిగినప్పటికీ ట్రయల్ రన్ సమయంలో సాక్షులు, బాధితులు సాక్ష్యం సక్రమంగా చెప్పాలన్నారు.అట్రాసిటీ చట్టం అమలును ఐటీడీఏ ఏపీవో పీవీఎస్ నాయుడు, చట్టాలను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరావు వివరించారు. జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, ఫైర్ ఆఫీసర్ కొవ్వాసి శ్రీనివాసరావు, బార్ ఆసోషియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడారు. సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సై డి.దుర్గామహేశ్వరావు, సీఐడీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

జీలుగుమిల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులు, ప్రజవాణి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో ఎంవీ.రమణ అన్నారు. తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. భూ వివాదాలు పరిష్కరానికి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించి ప్రజలకు న్యాయం చెయ్యాలని తహసీల్దారు స్లీవజోజికి సూచించారు.

ఆయుధ కర్మాగారం ఏర్పాటుతో యువతకు ఉపాధి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

టి.నరసాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గ పరిధిలోని జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం ప్రాజెక్టు ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు అన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంపీ మహేశ్ కుమార్ పనిచేస్తున్నారని వారన్నారు. బుధవా రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ఎంపీ పనిచేస్తున్నారన్నారు. ఆయుధ కర్మాగారం ప్రాజెక్టు ఏర్పాటుతో సుమారు 3వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించే వీలుందన్నారు. విద్యార్హతకు తగిన ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కొందరు కావాలని ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. నాయుడు రామకృష్ణగౌడ్, కొండపల్లి రవి, బొంతు సత్యనారాయణ, పెద్దిన సత్యనారాయణ, అనుమోలు శ్రీనివాసరావు, కొల్లి రమేష్, పెద్దిన చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మోక్షం

ఏలూరులో మరమ్మతు పనులు

భారీ గుంతలు పూడిక


నగరంలో రహదారి మరమ్మతు పనులు

గుంతలు లేని నగరం చేస్తాం..



రోడ్ల మరమ్మతులు చేపట్టి గుంతలు లేని నగరంగా తయారు చేస్తాం. ఇప్పటికే చాలా రోడ్లను మరమ్మతు చేశాం. నగరంలో 368రోడ్లను గుర్తించాం. డిసెంబర్ 10లోపు అన్ని మరమ్మతులు చేపట్టి నగర ప్రజలు ఆహ్లాదకరంగా తిరిగేందుకు కృషి చేస్తాం.

భానుప్రతాప్, కమిషనర్

ఏలూరు టూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గత ఐదేళ్ల రోడ్ల సమస్యను వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన లేదు. నగరంలో దాదాపు రోడ్లన్ని గుంతలమయం అయ్యాయి. వాహనాల రాకపోకలే కాదు కనీసం నడవడానికి సైతం అనువుగాని భారీ గుంతల రోడ్లపై వెళ్లాలంటే ప్రజలు బెంబెలెత్తే పరిస్థితి. ద్విచక్ర వాహనంపై కిలోమీటర్ దూరం అరగంట సమయం పట్టడమే కాదు నడుములు విరగాల్సిందే. పాదచారులు, వాహనదారులు గోతుల్లో పడి గాయపడిన సందర్భాలు అనేకం. ద్విచక్ర వాహనంపై వెళ్లే మహిళలు గుంతల్లోపడి దుస్తులు పాడై దెబ్బలతో ఇంటికి చేరుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మతు పనులు చేపట్టింది. వర్షాకాలం వలన రెండు, మూడు నెలలు ఆలస్యమైనా ప్రస్తుతం నగరంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి.

నగరంలో గుంతలు పడి దారుణంగా ఉన్న 368 రోడ్లను నగరపాలక సంస్థ అధికారులు గుర్తించారు. 6 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. రోడ్ల మరమ్మతులకు రూ. 30లక్షలు కేటాయించారు. డిసెంబర్ 10లోపు పనులన్ని పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.


ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, పెదపాడు, ధర్మాజీగూడెం గ్రంథాలయాల్లో విద్యార్థులకు బహుమతుల పంపిణీ

గ్రంథాలయాల్లో విజ్ఞాన సముపార్జన

ఏలూరు టూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు కోదండరామమూర్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం జరిగిన వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. వారం రోజులు విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. జి.కాళిదాసు, ఎం.గురుశర్మ, టీకే.లావణ్య, రమణ, వయోజన విద్య ఏడీ విజయ్‌కుమార్, శేఖర్‌బాబు, నారాయణరావు, సందీప్‌కుమార్ పాల్గొన్నారు. మహిళా గ్రంథాలయంలో యాగంటి శ్రీదేవి ఆధ్వర్యంలో ముగింపు సభ నిర్వహించారు. వై.సుశీల, బి.హిమాచలేశ్వరి, ప్రసన్న, ఎస్.విజయలక్ష్మి, సీహెచ్.సత్యశారద, కృష్ణప్రసాద్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆదిత్య డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన ముగింపు సభ జరిగింది. వీటీ.సందీప్‌కుమార్, వీ.వీరభద్రరావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, సుగుణారెడ్డి, నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పణికుమార్, సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: బాలల శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో రంగయ్య విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాట్యాచార్యుడు డి.హేమసుందర్, లైబ్రరీ నిర్వాహకులు ఎం.శోభ తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: గ్రంథాలయ వారోత్సవ పోటీల్లో విజేతలకు తహసీల్దారు ఎ.కృష్ణజ్యోతి బహుమతులు అంద జేశారు. నర్రా సుబ్బయ్య ఫౌండేషన్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ఎంఈవో డీవీ రమణ, గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

● లింగపాలెం: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూపించాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె. వెంకన్న అన్నారు. ధర్మాజీగూడెం గ్రంథాలయంలో విజేతలకు ఎస్ఐ వెంకన్న, గారపాటి నాగబుద్ధ వరప్రసాద్ బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ సీహెచ్ వెంకటరమణ, బీఎస్‌వీఎస్ ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎస్సై ఎం.జయబాబు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ ఆర్. కిశోర్, బొర్రంపాలెం పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ఆంజనేయులు, కె.కుటుంబరావు, ఎస్.ఏసుబాబు, కె.రాజు, పురం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: శాఖా గ్రంథాలయంలో జరిగిన పోటీలలో విజేతలకు ఎంపీడీవో రాజ్ మనోజ్ బహుమతులు అందజేశారు. గ్రంథపాలకుడు చిట్టూరి గంగాధరం పాల్గొన్నారు.

● భీమడోలు: పూళ్ళ శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. జడ్పీ హైస్కూలు హెచ్ఎం భువనేశ్వరరావు, ఉపాధ్యాయులు గ్రంథాలయ విశిష్టతను వివరించారు. గుండుగొలను గ్రంథాలయంలో గారపాటి సునీత ఆధ్వర్యంలో హైస్కూలు హెచ్ఎం పద్మశ్రీ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ కార్యదర్శి ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: శాఖా గ్రంథాలయంలో కొంకెపూడి అనురాధ రచించిన మహతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. షేక్ ఇబ్రహీం, పి.గసబాబు, పాల్, ఎం.భీమరాజు, టీవీఎస్.రాజు, కొండూరు రాజా, మారం ధనలక్ష్మి, బొల్లు వెంకటేశ్వరరావు, వీరమళ్ళ మధు, ఎం.సుకన్య, సీహెచ్.వెంకట రమణ పాల్గొన్నారు.

● చింతలపూడి: గ్రంథాలయంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, లైబ్రేరియన్ ఎస్.వర్మ పాల్గొన్నారు.

● పెదవేగి: గ్రంథాలయ వారోత్సవాల్లో వివిధ పోటీల్లో విజేతలకు ఎంఈవో-2 వి.అరుణ్ కుమార్ బహుమతులు అందించారు. హైస్కూల్ పీడీ ధనలక్ష్మి, ఎం.జ్యోతి, తోట అరుణ్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: పంగిడిగూడెం జడ్పీ స్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు హెచ్ఎం సురేష్ అధ్యక్షతన జరిగింది. విజేతలకు బహుమతులు అందజేశారు. మద్దాల పెద్దిరాజు, రమేష్, మల్లయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సెట్‌వెల్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. విద్యతోపాటు వ్యక్తిత్వ నైపుణ్యాలను అలవరచుకోవాలని సెట్‌వెల్ సీఈవో కేవీఎస్.ప్రభాకరరావు సూచించారు. సామాజిక మాధ్యమాలతో సమయాన్ని వృధాచేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జిల్లా ఉపాధి కల్పన ఆఫీసర్ మధుభూషణరావు కోరారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, జిల్లా పర్యాటకశాఖ మేనేజర్ పట్టాభి, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు బాధితులకు కిట్‌ల పంపిణీ

ఏలూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు బాధితులకు లంబాడీపేట అర్బన్ పీహెచ్‌సీలో ఎంఎంకె(మోర్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్స్)ను మెడికల్ ఆఫీసర్ ట్వింకిల్ పంపిణీ చేశారు. గాయాలను శుభ్రపరచుకోడానికి కిట్‌లు ఉపయోగపడతాయన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, ఎల్రెప్ సొసైటీ ప్రతినిదులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల రక్తదానం

ఏలూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఆర్ఆర్ కళాశాలలో రెడ్‌క్రాస్ బుధవారం నిర్వహించిన రక్తసేకరణ శిబిరంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 యూనిట్ల రక్తాన్ని దానం చేసారని ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. కరస్పాండెంట్ విష్ణుమోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు భాషా, శంకర్, రెడ్‌క్రాస్ వైద్యులు ప్రసాదరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.


అప్పలనాయుడ్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే

కష్టపడే వారికి గుర్తింపు

ఏలూరు టూటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బడేటి చంటిని కలిశారు. కూటమి విజయానికి కృషి చేసిన రెడ్డి అప్పలనాయుడుకు పదవి దక్కినందుకు ఆనందంగా ఉందని చంటి అన్నారు.

● పోలవరం ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడికి పోలవరం జనసేన నేత చెంచాని రత్నప్రసాద్, నాయకులు పూలబొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. కె.రాము, సీహెచ్ అవినాశ్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

ఉంగుటూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు 1, 2, వెల్లమిల్లి 1, 2 సచివాలయాలను ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపై ఆరా తీశారు.


మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో గులాబీలతో పూజ, పట్టిసీమ శివక్షేత్రంలో అభిషేకాలు

మద్ది ఆంజనేయుడికి లక్ష గులాబీల పూజ

జంగారెడ్డిగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాలలో భాగంగా గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి బుధవారం లక్ష గులాబీల పూజ నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో ఆర్‌వి.చందన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు

గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం వేదపండితులు శ్రీరామకుమార్ శర్మ వ్రతాన్ని ఆచరింపజేశారు. అర్చకులు నల్లూరు రవికుమారాచార్యులు, రుషికేష్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో మానికల రాంబాబు, అబ్బిన దత్తాత్రేయ, రెడ్డి రంగా ప్రసాద్, దండు ధనరాజు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి అభిషేకాలు

పోలవరం: కార్తీకమాసం సందర్భంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో, గుంజవరం ఉమాసహిత భోగలింగేశ్వరస్వామి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, భస్మాభిషేకం, బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన, మహా మంగళ హారతులు నిర్వహించారు. పట్టిసీమ శివక్షేత్రానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది ఉచిత దర్శనం కల్పించారు. కార్తీకమాసం నెలరోజులు ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన, అల్పాహారం తీర్థప్రసాదాలు, ఉచిత దర్శనాల సౌకర్యాలు కొనసాగుతాయని ఆలయ ఈవో చాగంటి సురేష్ నాయుడు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు

ఏలూరు కార్పొరేషన్: సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం కార్తీక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, బిల్వార్చన చేశారు. స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలను వెలిగించారు. ఐస్‌తో తయారు చేసిన శివలింగాన్ని ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ భక్తులతో పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించారు. భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో సీహెచ్.చిన నాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.



గెలుపొందిన విద్యార్థులు,పేరెంట్స్‌తో పాఠశాల సిబ్బంది

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ఫ్యాషన్ వాక్

జంగారెడ్డిగూడెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఫ్యాషన్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా ఫ్యాషన్‌వాక్‌లో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కలగర దివ్య బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ మద్దిపాటి చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ లెక్చరర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ రిటైర్డ్ కాలేజి టీచర్స్ అసోసియేషన్ (ఆర్.సి.టి.ఎ) జిల్లా కార్యవర్గ ఎన్నికలు బుధవారం సీఆర్ఆర్ కళాశాల ఆడియో, విజువల్ హాలులో జరిగాయి అధ్యక్షుడిగా షేక్‌హుస్సేన్, కార్యదర్శిగా లేళ్ళ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా పి.ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.సుబ్బలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా డి.బ్రహ్మేశ్వరి, ఉత్తమదుర్గ, కె.రాణి, ఎస్‌సీ.డేనియల్, జి.రాంబాబు, ఎ.వీరభద్రరావు, ఎం.సంపదరావు, కె.శ్రీకాంత్, కె.బాలకృష్ణారావు, ఎస్‌వీవీఎస్.ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం మూడేళ్ళపాటు బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తొలుత గత మూడేళ్లలో మృతిచెందిన సంఘ సభ్యులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న తపన చౌదరి

సత్యవతమ్మకు తపన చౌదరి నివాళి

కామవరపుకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీలకర్రగూడెం జమీందారు దివంగత రాజా రాఘవరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులను బుధవారం తపన చౌదరి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సత్యవతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జమీందారు కుటుంబం చేసిన సేవలను గుర్తు చేశారు. మాజీ మంత్రి పీతల సుజాత, పోలవరం మాజీ ఎమ్మెల్యే ముడియం శ్రీనివాసరావు, ఘంటా సుధీర్‌బాబు, మందలపు కృష్ణారావు, కంఠమనేని అంజిమూర్తి బృందం సత్యవతమ్మకు నివాళులర్పించారు. జమీందారు కుటుంబ సభ్యులు రాజా రాఘవరాజు వెంకటరాజు, రంగరాజు, వీర రామకృష్ణంరాజు, యర్రంరాజు, వెంకట రామ కృష్ణంరాజు, నల్ల నారాయణరాజును పరామర్శించి సానుభూతి తెలిపారు.

హౌస్ హోల్డ్ సర్వే

ద్వారకాతిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో సూపర్‌సిక్స్ పథకాల లబ్ధిదారులకు జియోట్యాగింగ్‌పై జరుగుతున్న హౌస్ హోల్డ్ సర్వే కీలకంగా మారనుందని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు అన్నారు. ద్వారకాతిరుమలలో బుధవారం జరుగుతున్న సర్వేను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎంపీడీవో ప్రకాష్, ఈవోపీఆర్డీ సుబ్బరాయన్ తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

లింగపాలెం/చింతలపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గోకవరం, పాశ్వానగరం గ్రామాలలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు చేశారు. పాశ్వానగరం గ్రామానికి చెందిన మహిళ వద్ద 3 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆర్‌వీఎల్ నరశింహారావు తెలిపారు. కళ్ళచెరువుకు చెందిన బెల్టు షాపు నిర్వాహకుడు జుత్తిగ ప్రసాద్‌ను కామవరపుకోట తహసీల్దార్ ముందు హాజరుపరిచి బైండోవర్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

● ఏలూరు క్రైం: ఏలూరు రూరల్ మండలం వైఎస్ఆర్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేసి 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

పెదపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు పరిసరాల్లో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. రూ.8,800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహన, యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడి

ద్వారకాతిరుమల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలవరం కుడికాలువ మట్టిని అక్రమంగా తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, రెండు మట్టి ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. ఏఈ బాబూజీ, సిబ్బంది లైన్ గోపాలపురం వద్ద తవ్వకాలను అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.



కెరటాలకు ఎదురీత

కెరటాలతో నిత్యం పోరాటం... అడుగడుగునా ప్రాణసంకటం..అయినా వేటే వారి జీవనాధారం...అందులోనే ఆనందం..మత్స్య సంపద దొరికితేనే సంతోషం... లేకపోతే... పస్తులు.. ఇదీ మత్స్యకార జీవన చిత్రం. తరాలు మారుతున్న వీరి బతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే మిగిలాయి. వల వేసి చేప పట్టడం తప్ప మరో పని చేయలేని పరిస్థితి. జిల్లాలో చాలామంది మత్స్యకారులు వేట సాగించలేక వలస కూలీలుగా మారిపోతున్నారు. ఇక ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడల్లా వేటకు విరామం ఇవ్వాల్సిందే. నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని మత్స్యకారుల జీవనంపై ప్రత్యేక కథనం

- మారని మత్స్యకార బతుకులు
- ఇంకా సంప్రదాయ వేటే ఆధారం
- ప్రభుత్వ సాయం అంతంతే..
- అభివృద్ధికి అమడిదూరంలో మత్స్యకార గ్రామాలు
- నది జలాల కాలుష్యంతో హరించిపోతున్న మత్స్య సంపద

నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

నరసాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లా మత్స్య సంపదకు పెట్టింది పేరు. నిత్యం రూ.10 కోట్లు పైనే వ్యాపారం సాగు తుంది. ఇందులో అత్యధిక ఆదాయం సముద్ర వేట నుంచి వచ్చే మత్స్య సంపద ఎగుమతి వల్లే వస్తుంది. ఇక పోలవరం నుంచి నరసాపురం బియ్యపుతిప్ప వరకు విస్తరించిన గోదావరిలో దొరికే మత్స్య సంపద కూడా అపారం. జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా నిత్యం ఎగు మతులు జరుగుతుంటాయి. ఇక కొల్లేరు, ఉప్పు టేరు, ఎర్రకాల్వలో కూడా అపారంగా మత్స్య సంపద దొరుకుతుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష మందిపైగా మత్స్యకారులు వేటనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది నేటికి సంప్రదాయ వేటనే అనుసరిస్తున్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సముద్ర వేట సాగించే మత్స్యకారులు మాత్రం మెకనైజిడ్ బోట్ల ద్వారా వేటాడుతున్నారు.

అంతరించిపోతున్న చేప జాతులు

నదీ జలాల కలుషితం, ఆయిల్ నిక్షేపాల కోసం సముద్రగర్భంలో సాగిస్తున్న అన్వేషణ తదితర కారణాల వల్ల కొన్ని రకాల జాతుల మత్స్య సంపద హరించిపోతోంది. ఉప్పుటేర్లు, గోదావరిలోనూ ఇదే పరిస్థితి. చెరువుల్లోని నీరు ఉప్పుటేర్ల గుండా సముద్రం, గోదావరిలో కలుస్తున్నది. అభివృద్ధి పేరుతో పరిశ్రమలు పుట్టుకు రావడం, అవి వెదజల్లే కాలుష్యంతో నదీ జలాలు కలుషితమై జల పుష్పాలు రోజు రోజుకు హరించి పోతున్నాయి.

ఇంకా సంప్రదాయ వేటలోనే

గతంలో మత్స్యకారులు మాత్రమే వేటాడే వారు. నేడు కార్పొరేట్ సంస్థలు ఈ రంగంలోకి వచ్చాయి. పెద్ద పెద్ద ట్రాలర్లు , హైస్పీడ్ బోట్లను వినియోగించి సముద్ర అడుగుభాగంలో సంచరించే మత్స్య సంపదను టెక్నాలజీని ఉపయోగించి వలలతో బంధిస్తున్నారు. అయితే జిల్లాలోని మత్స్యకారులు మాత్రం ఇంకా సంప్రదాయ పద్ధతిలోనే వేటా డుతున్నారు. పడవలు, వలలతో నదులు, కాల్వలు, ఉప్పుటేర్లలో వేటాడటం వల్ల వీరికి దొరికే మత్స్య సంపద అంతంత మాత్రంగానే ఉంటున్నది. ఇక కడలిలో వేటాడే సోనా బోట్లు హైస్పీడ్ బోట్లు కావు. దీంతో వేటకు వెళ్లినా పుష్కలంగా మత్స్య సంపద చిక్కడం లేదు. దీంతో వీరు అలలకు ఎదురేగి వేటాడుతున్నా తగిన ఫలం దక్కడం లేదు.

వలస బాట

ఉపాధి లేకపోవడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం తదితర కారణాల రీత్యా చాలామంది మత్స్యకారులు వృత్తికి దూరమవుతు న్నారు. కొందరు వలసబాట పడుతున్నారు. జిల్లా నుంచి ఏటా రూ.350 కోట్లుపైనే మత్స్య సంపద ఎగుమతి అవుతుంది. దీని వల్ల ప్రభుత్వానికి విదేశీ మారకద్రవ్యం వస్తున్నా అందులో మత్స్యకారుల అభివృద్ధికి వెచ్చిస్తున్నది నామా మత్రంగానే ఉంటున్నది. తుపాన్లు, వాయు గుండాలు వచ్చినప్పుడు మత్స్యకారులు ఉపాధికి దూరమవుతున్నారు. ఇలాంటి సమయంలో కూడా ప్రభుత్వం వీరికి అండగా నిలవడం లేదు.

నోచుకోని గురుకులాలు

ఇక మత్స్యకారులకు వైద్యం, విద్య కూడా అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. తీర ప్రాంతాల్లో గురుకుల పాఠశాలు ఏర్పాటు చేస్తా మని హామీలు ఇస్తున్నారే తప్ప అవి కార్యరూపం దాల్చడం లేదు. ఇటు వైద్యం కూడా వీరికి దూరమైపోతుంది. సాధార ణంగా మత్స్యకారులు సముద్ర తీర ప్రాంతాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఏదైనా అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వచ్చేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తీర గ్రామాల్లో కనీసం పీహెచ్‌సీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం లేదు.

పెరగని వేట విరామ భృతి

ఏటా నిత్యావసరాలు ధరలు పైపైకి పెరుగు తున్నాయి. కానీ వేట విరామ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న భృతి మాత్రం పెంచడం లేదు. నేటికి రెండునెలల కాలానికి రూ.10 వేలు ఇస్తున్నారు. నిత్యావ సరాలు ఇవ్వడం లేదు. ఈ మొత్తంతోనే కుటుంబ 60 రోజుల పాటు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక డీజిల్ సబ్సిడీ కూడా పెంచడం లేదు, సముద్ర వేట సాగించే మత్స్యకారులకు నెలకు 300 లీటర్ల డీజిల్‌పై సబ్సిడీ ఇస్తున్నారు. అది కూడా లీటర్‌కు రూ.9 మాత్రమే. ఇదే కొన్ని రాష్ట్రాల్లో రూ.20 ఇస్తున్నారు.



భళారే.. బొమ్మ

- టీవీతోనే తెల్లారుతోంది..
- ఒకప్పుడు ఊరికి ఒకటో రెండో..
- ఇప్పుడు ఇంటికో టీవీ
- కార్టూన్స్‌తో పిల్లల కాలక్షేపం
- పెద్దవాళ్లకి పెద్ద రిలాక్స్ ఇదే..

నేడు టెలివిజన్ దినోత్సవం

ఒకప్పుడు ఆకాశవాణి ..రేడియోనే పరిచయం. టెలివిజన్ అంటే ఒక వింత.. వాస్తవానికి 1927 సెప్టెంబరు 7వ తేదీన తొలి ఎలక్ట్రానిక్ టెలివిజన్ ప్రసారం అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో గ్రామ గ్రామాన టెలివిజన్ విస్తరించడానికి మరో అర్ధ శతాబ్దం పట్టింది. రెండు దశాబ్దాలుగా పల్లెలు, గ్రామాల్లో రంగుల టీవీలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్ ఫోన్లు యువత చేతుల్లోకి వచ్చిన తరువాత టెలివిజన్‌కు కొంత ప్రాధాన్యం తగ్గినప్పటికీ ఇప్పటికీ అధికంగా జన హృదయాలలో పదిలంగా ఉండేది టీవీ మాత్రమే. నేడు టెలివిజన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పాలకొల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):

ఇప్పుడు ఒకే ఇంటిలో ఒకే సమయంలో పిల్లలు, వయోజనులు, వృద్ధులు టీవీ చూడా లంటే పోట్లాడుకునే పరిస్థితి వచ్చింది. అందు కేనేమో ఇంటి పెద్దాయన టీవీ సీరియల్స్ చూడటానికి ఒక చిన్న టీవీ.. కార్టూన్ నెట్ వర్క్ చూడటానికి చిల్డ్రన్స్ రూమ్‌లో మరో టీవీ, ఇల్లాలు సీరియల్స్‌కి హాల్లో పెద్ద సైజు డిజిటల్ టీవీ ఇలా టీవీలకు ప్రాధాన్యం పెరిగింది.. నాలుగు దశాబ్దాలకు వెనక్కి వెళితే గ్రామాల్లో బ్లాక్ అండ్ వైట్ టీవీలే ఉండేవి. గ్రామం మొత్తంగా 1, 2 కలర్ టీవీలు ఉంటే గొప్ప విషయమే. ఆ రోజుల్లో కేవలం దూరదర్శన్‌లో శుక్ర, శని వారాల్లో తెలుగు సినిమాలు, ప్రోగ్రామ్‌లు వచ్చేవి. దూరదర్శన్‌లో సినిమా వచ్చే రోజుల్లో టీవీలను అరుగుల మీద పెట్టేవారు. చుట్టుపక్కల పిల్లలు పెద్దలు సమారు 40, 50 మంది అరుగుల మీద కూర్చుని టీవీ చూసేవారు. వారికోసం ఒక బిందెతో మంచి నీరు కూడా ఉంచేవారు. నేడు పరిస్థితులు మారాయి. పేద, గొప్ప తారతమ్యం లేకుండా అన్ని ఇళ్లల్లోనూ టీవీలు ఉంటు న్నాయి. సంపన్నుల ఇళ్ళలో సినిమా థియేటర్లలోని స్క్రీన్లను తలద న్నేవిధంగా పెద్ద సైజు టీవీలు ఉంటున్నాయి. ఒకప్పుడు టెలివిజన్ కేవలం వినోదానికే అయితే, ఇప్పుడు విజ్ఞానానికే ఉపయోగపడుతోంది.. టెలివిజన్ వీక్షకులలో సృజనాత్మకత పెంచుతుంది. పలు చానల్స్‌లో జ్ఞానాన్ని అందిస్తున్నాయి. వృద్ధులకు కాలక్షేప సాధనంగా ఉపయోగపడుతోంది. టెలివిజన్ ద్వారా వివిధ ప్రాంతాలు, దేశాల సంస్కృతిని తెలుసుకోవడమే కాకుండా వివిధ భాషలను నేర్చుకునే అవకాశం కూడా ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే టెలివిజన్ కనిపెట్టిన వ్యక్తి తన పిల్లలను టీవీ చూడనివ్వ లేదట. టెలివిజన్‌లో విలువైనది ఏమీ లేదని అతను చెప్పడం గమనార్హం..

అరుగు నిండిపోయేది

పాలకోడేరు : ఒకప్పుడు ఇంట్లో రేడియో, టేప్ రికార్డర్ ఉంటే చాలు ఎంతో ఆనందంగా ఉల్లాసంగా గడిపేవారు. అవి ఉంటేనే గొప్పగా చెప్పుకునేవారు. తర్వాత టెలివిజన్ వచ్చింది. ఊరుకో టీవీ ఉంటే ఎంతో ఆశ్చర్యంగా గొప్పగా చెప్పుకునేవారు. శుక్రవారం వచ్చిందంటే సినిమా పాటల కోసం ఓ గంట ముందే ఆ పేట వాసులంతా ఇంటి ముందు వాలిపోయేవారు. ఆది వారం వచ్చిందంటే ఇంకా సందడి. ఆ టీవీలో వచ్చే సినిమా చూసేందుకు ఎంతో ఆసక్తి కనపరిచేవారు.శుక్రవారం చిత్రలహరి, శనివారం హిందీ సినిమా, ఆదివారం తెలుగు సినిమా కోసం టీవీల వద్ద అతుక్కుపోతూ ఉండేవారంటే అతిశయోక్తికాదు. అలా ప్రతీ గ్రామంలోను ఒకరిద్దరికి మాత్రమే టీవీలు ఉండేవి. ఇంటి యాజమానులు సైతం శుక్రవారం వచ్చినా, ఆదివారం వచ్చినా పనులు ముందు గానే చక్కదిద్దుకుని జనం టీవీ చూసే విధంగా ఏర్పాట్లు కూడా చేసేవారు. మధ్యమధ్యలో టీవీ రాకపోతే యాంటీనా మార్చుతూ ఎన్నో తిప్పలు పడేవారు. ఆ రోజులు తలచుకుంటే భలే తమాషాగా ఉంటాయి.

మా ఊళ్లో రెండో..మూడో ఉండేవి..

సుమారు 50 సంవత్సరాల క్రితం మా ఊళ్ళో రెండు మూడు టీవీలు మాత్రమే ఉండేవి. శుక్రవారం ఆదివారం వచ్చిందంటే ముందుగానే ఇంట్లో పని చేసుకోవాల్సి వచ్చేది. టీవీ చూసేందుకు ఆ వీధిలో ఉన్న చిన్నా, పెద్దా ఇంటికొచ్చి గంట ముందే కుర్చునిపోయేవారు. చిత్రలహరి తెలుగు సినిమా చూసేందుకు ఎగబడేవారు. ఆ సందడే వేరు..

-మరపట్ల వరప్రసాదరావు, గొల్లలకోడేరు

ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే సొమ్ము జమ

- కూటమి ప్రభుత్వం రికార్డు
- ఆనందంలో మండల రైతులు

ముదినేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం అమ్మకాల్లో రైతులు గత ఐదేళ్లుగా ఎదుర్కొన్న ఇబ్బందులు తొలగాయి. వైసీపీ ప్రభు త్వం ధాన్యం కొనుగోళ్లలో విధించిన నిబంధనలు, షరతులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం సడ లించడంతో రైతులు పూర్తిస్థాయిలో వెసులు బాటు పొందారు. ధాన్యం కొనుగోళ్లు ఎంత వేగం గా జరుగుతున్నాయో అంతే వేగంగా రైతుల బ్యాంక్ ఖాతాలకు సొమ్ము జమ అవుతోంది. మండలంలో ఈ నెల 18 సాయంత్రానికి అమ్మిన ధాన్యానికి 19వ తేదీ సాయంత్రానికి 24 గంటల్లో రైతుల ఖాతాలకు పూర్తిస్థాయిలో సొమ్ము జమ అయింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు 1,615 మెట్రిక్ టన్నుల సార్వా ధాన్యం అమ్మగా, రైతుల బ్యాంక్ కాతాలకు రూ.3.74 కోట్లు జమ అయ్యాయి. డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ కృష్ణమోహన్ పర్య వేక్షణలో మండల ఇంచార్జ్ విజయ్ రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగంగా జరగడంతో రైతు లకు గతంలోలా ఇబ్బంది లేకుండా పోయాయి.

రైతులకు ఆర్థిక వెసులుబాటు



ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం కల్పించిన వెసులు బాటు రైతులకు ఎంతో ప్రయో జనకరంగా ఉంది. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే సొమ్ము రైతులకు అందడం ఆనందంగా ఉంది.

- అనగాని గంగాధర్ రావు, రైతు, వడాలి



లలిత కళల్లో ఆర్సీఎం విద్యార్థుల ప్రతిభ

చాట్రాయి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల స్థాయిలో ఇటీవల మంగళగిరిలో నిర్వహించిన సీఎస్ఏ సాహిత్య లలిత కళల పోటీలలో విజే తలుగా నిలిచిన చాట్రాయి ఆర్సీఎం యూపీ స్కూల్ విద్యార్థులను బుధవారం హెచ్ఎం సిస్టర్ పెరియా నాయకి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీలలో విద్యార్థులు చార్విక సుప్రియ, యస్వంత్ కుమార్, తేజ మణికంత, ప్రేమ్ కుమార్, సన్నీ వివిధ విభా గాలలో ప్రతిభ చూపినట్లు హెచ్ఎం చెప్పారు.



పశుగణన సర్వే పరిశీలిస్తున్న డీడీ

సమగ్రంగా పశుగణన సర్వే చేయాలి

మునునూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వే పూర్తి వివరాలతో సమగ్రంగా చేయాలని నూజివీడు పశుసంవర్థక ఉప సంచాలకులు ఎం.చంద్రశేఖర్ ఆదేశించారు. ముసునూరులో బధవారం జరుగుతున్న 21వ అఖిలభారత పశుగణన సర్వేను ఆయన తని ఖీ చేశారు. నిబంధనల ప్రకారం సర్వే చేస్తున్నారా అని పరిశీలించారు. పశు వైద్యాధికారి ఎం.కృష్ణ చైతన్య పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి

విద్యా హక్కు చట్టంపై అవగాహన సదస్సు

నూజివీడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నూజివీడు నెహ్రూపేటలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె పెద ఖాసిం పిల్లల విద్యా హక్కు చట్టం, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, లేబర్ యాక్ట్, ఇతర పిల్లల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో బార్ అధ్యక్షుడు సత్యప్రకాష్, గోపీ నాథ్, వార్డెన్ ఉషారాణి పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్లు

కలిదిండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో 21 పంచాయతీల్లో రూ.5.80 కోట్లతో చేపట్టిన 60 సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ 31 కల్లా సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఏఈఈ బుసన బోయిన శ్రీనివాస్ తెలిపారు.

పొలం పిలుస్తోంది

కలిదిండి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యంలో తేమ లేకుండా చర్యలు తీసుకోవా లని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ రైతులకు సూచించారు. కోరుకొల్లులో బుధవా రం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గతో కలసి సబ్సిడీ మినుము విత్తనాలను రైతులకు పం పిణీ చేశారు. మాజీ ఎంపీపీలు వలవలరావు, కేశిరెడ్డి బలరామ్, వ్యవసాయ అధికారులు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం

చాట్రాయి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాడాలని కోర్ కమిటీ సభ్యుడు నక్కా రాము కోరారు. నూజివీడులో ఈనెల 24న జరిగే మాలల ఆత్మ గౌరవసభ పోస్టర్‌ను సూరంపాలెంలో బుధవారం విడుదల చేశారు. నక్కా రాము మాట్లాడుతూ వర్గీకరణ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి విరుద్ధమని, కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు.

ఎక్సైజ్ దాడులు: ఇద్దరి అరెస్టు

నూజివీడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సారా బట్టీలపై దాడులు నిర్వహించి 20 లీట ర్లు సారా స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అదుపు లోకి తీసుకొని బెల్లం ఊటను ధ్వంసం చేసి నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. చాట్రాయి మండలం పోతనపల్లి చిన్న తండా, ఆగిరిపల్లి మండలం సింగన్నగూ డెంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు





చనుబండ, కలిదిండిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

ముదినేపల్లి/కలిదిండి/మండవల్లి/ కైకలూరు, చాట్రాయి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ముదినేపల్లి గ్రంథాలయంలో వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు టీడీపీ కైకలూ రు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు బహుమతులు అంద జేశారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరే షన్ డైరెక్టర్ కొడాలి వినోద్ స్పాన్సర్ చేసిన బహుమతులను 108 మంది విద్యార్థులకు అంద జేశారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి అధ్యక్షత న జరిగిన ఈ ముగింపు సభలో సర్పంచ్ నిమ్మ గడ్డ కైకమ్మ, ఎస్ఐ వి.ఎస్. వీరభద్రరావు తది తరులు పాల్గొన్నారు. గురజ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి ఝాన్సీరాణి ఆధ్వర్యంలో ముగింపు కార్య క్రమాలు జరిగాయి. కలిదిండి, కోరుకొల్లులో వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. కలిదిండి గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు తహసీల్దార్ రామకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారులు జె.రమేష్ బాబు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి గ్రంథాలయంలో విజేతలకు తహసీల్దార్ గోపాల్, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కొండలరావు, హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్, గ్రంథాలయ అధికారిణి షేక్ పర్వాని చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కైకలూరు గ్రంథా లయంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, రాష్ట్ర తెలుగుయువత కార్యవర్గ కార్యదర్శి పూల రామచంద్రరావు, జనసేన పార్టీ నాయకుడు కొల్లి వరప్రసాద్, సాహితీమిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకట నారాయణ, న్యాయవాది రుద్రపాక రత్నారావు, గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి మండలం చనుబండ శాఖ గ్రంథాలయంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కా ర్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు వివిధ పోటీ లలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వ రరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి, కిరణ్మయి, లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు



విద్యార్థినిలతో కరచాలనం చేస్తున్న డీఎస్పీ

ఆగిరిపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువహో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా తోటపల్లిలోని హిల్ ప్యారడైజ్ స్కూల్లో విద్యార్థు లకు పాటల పోటీలను నూజివీడు సబ్ డివి జనల్ పోలీస్ అధికారులు నిర్వహిం చారు. డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ హైస్కూల్స్‌లో పాటలు, తదితర పోటీ లు నిర్వహిస్తున్నామని, మారుమూల పల్లెల్లో మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నా మని తెలిపారు. విద్యార్థినులపై జరిగే అకృత్యాలు నివారణ కోసం జిల్లా ఎస్పీ 955 0351100 నెంబరుతో వాట్సప్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆపద సమయాల్లో తక్షణమే సహాయం కోసం డయల్ 112కు సమాచారం అందిస్తే 10 నిమిషాల్లో పోలీస్ సహాయం అందిస్తారని తెలిపారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే..



మండవల్లి మండలం లింగాలలో అవగాహన ర్యాలీ

ముదినేపల్లి/ కలిదిండి/మండవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధ వారం ముదినేపల్లి మండలం వాడవల్లి యూపీ పాఠశాలలో బాల్య వివాహాలు - అనర్థాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం ఎం.సాయిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల బాలికలు ఆరోగ్యం దెబ్బతినటమే కాక భవిష్య త్తులో ఎన్నో అనర్థాలు ఏర్పడుతాయని ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ తెలిపారు. పెదపాలపర్రు, పెద గొన్నూరు హై స్కూళ్లలో బాల్య వివాహాలను అరిక ట్టడంపై అవగాహన సదస్సులు నిర్వ హించారు. కలిదిండి జడ్పీ హైస్కూల్ లో బేటీ బచావో - బేటీ పడావో కార్య క్రమంలో భాగంగా సదస్సు నిర్వహిం చారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.కరుణకుమారి, హెచ్ఎం స్వర్ణకుమా రి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండ వల్లి మండలం లింగాల జడ్పీ హైస్కూల్‌లో మిషన్‌శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగం గా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి పథకం అమలు చేస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట నాగలక్ష్మి అన్నారు. హెచ్ ఎం వంగా శ్రీనివాసరావు, సచివాలయ, అంగన్ వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బీఐఎస్ డిపూటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ట్రిపుల్‌ఐటీ అధికారులు

ట్రిపుల్‌ఐటీ అధికారులతో సమావేశం

నూజివీడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) శాస్త్రవేత్త, డిప్యూటీ డైరెక్టర్ ఫైలా దేశిక్ బుధవారం సమా వేశమయ్యారు. ప్రయోగశాల నాణ్యత, నిర్వహ ణ, ప్రామాణికతను ప్రోత్సహించడం తదితర విషయాలపై చర్చించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ పరిశో ధనలు పర్యావరణ వ్యవస్థను సుసంపన్నం చేయటానికి ఉపయోగపడతాయన్నారు. దీనిపై బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ ఫైలా దేశిక్ మాట్లా డుతూ ఇరు సంస్థల పరస్పర సహకారంతో పరి శోధన, నైపుణ్యం, నాణ్యతా ప్రమాణాలు పెం పొందించడం కోసం పనిచేద్దామన్నారు.

110 చెన్న కేశవ దేవుళ్ల ఊరేగింపు

చాట్రాయి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి చనుబండ కోదండరామస్వామి దేవస్థానం వరకు 110 చెన్నకేశవ దైవాలతో బుధ వారం భారీ ఊరేగింపు జరిగింది. కారంపూడి పీఠాధిపతి చెన్నకేశవ ఆధ్వర్యంలో ముందుగా వీరాంజనేయస్వామికి పూజలు నిర్వహించి ఊరేగింపు బయలుదేరగా వందలాది మంది భక్తులు అనుసరించారు. సుమారు 2.5 కిలో మీటర్లు ఊరేగింపు నిర్వహించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మండవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లోకుమూడి పరిధిలోని ఏలూరు-కైకలూరు రోడ్డు లోని అయ్యప్పస్వామి దేవస్థానం వార్షికోత్సవ సందర్భంగా బుధవారం అయ్యప్పస్వాములుతో కిక్కిరిసింది. ఉదయం స్వామికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు, 108 కలశాలతో పూజ, సాయంత్రం ఏడు గంటల నుంచి పట్నాల సుబ్ర హ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో పదునెట్టాం బడి పడిపూజ, పెడన బాలాజీ, శిష్య బృందం భజన తో ఆలయం మార్మోగింది. స్వాములతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం లో ఇరుముడుల కార్యక్రమం జరిగింది.

వైభవంగా గుర్రాలమ్మ కల్యాణం

ముసునూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొర్లకుంట గ్రామంలో గుర్రాలమ్మ, గుర్రాలయ్య స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తొమ్మిది మంది దంపతులు పీటలపై కూర్చొని అమ్మవారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మేళతాళాలు, కోలాటాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.



చనుబండలో భారీ ఊరేగింపు



కొర్లకుంటలో గుర్రాలమ్మ కల్యాణం



ఆక్రమణల తొలగింపు

చాట్రాయి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జనార్దనవరం గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఆక్రమణల తొలగింపును బుధవారం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికా రులు చేపట్టారు. రోడ్డు మార్జిన్లను ఆక్రమిం చడంతో కచ్చా డ్రెయిన్లు పూడుకుపోయి వర్షం నీరు, గృహాలలో వాడిన మురుగు నీరు రోడ్లపై నిలిచి రహదారి ధ్వంసమై అధ్వానంగా తయా రవడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మాజీ సర్పంచ్‌లు పలగాని దు ర్గారావు, పామర్తి నాగేశ్వరరావు, టీడీపీ నాయ కులు కలకొండ భాస్కరరావు పాల్గొన్నారు.



జిల్లా త్రోబాల్ జట్టుకు ఐశ్వర్య ఎంపిక

ముసునూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలకు ముసునూరు జడ్పీపాఠశాల విద్యార్థిని పి.ఐశ్వర్య ఎంపికైన ట్లు పాఠశాల హెచ్ఎం ఏ.సునీల తెలిపారు. ఈ 13న ఉమ్మడికృష్ణా జిల్లా గూడూరు ఉన్న త పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీల్లో ఐశ్వర్య ఉత్తమ ప్రతిభ కనబర్చి అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైయిందని ఆమె తెలిపారు. వచ్చే నెల 12, 13తేదీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లిలో రాష్ట్రస్థాయి త్రోబాల్ జరుగుతా యని హెచ్ఎం తెలిపారు. విద్యార్థి ఐశ్వర్యను వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.హేమదేవి, అలీఖాన్, ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

సీసీరోడ్లు నాణ్యతతో నిర్మించాలి

ముసునూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీరోడ్లు నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. ముసునూరులో నిర్మిస్తున్న సీసీరోడ్లను ఆమె బుధవారం ఏపీవో రోజిలీలతో కలిసి పరిశీలిం చారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా సీసీరోడ్ల నిర్మాణాలకు ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేయకుండా, నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మా ణం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), వార్డు సభ్యుడు ఎస్.రాంబాబు, పంచాయితీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, నగదు ప్రోత్సాహాలను అందజేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు

కైకలూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో నైపుణ్యాలను ప్రదర్శిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రొఫెసర్ సుధా బత్తుల విజయ్‌కుమార్ అన్నారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సును నిర్వ హించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను, నగదు ప్రోత్సాహాలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి, మానవత సంస్థ చైర్మన్ కొండ్రెడ్డి చిట్టెమ్మ, మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సత్యనారాయణ, కోశాధి కారి ఇమ్మడి విఠల్, కోచైర్మన్ గుర్రం శ్యామ్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గుడ్డ సంచుల పంపిణీ

కైకలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్లాస్టిక్ నివారించే గుడ్డ సంచులను వినియోగించాలని స్వీప్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి.పవన్‌కాంత్ అన్నారు. కైకలూరు భవానమ్మ చెరువు గట్టుపై ఉన్న అయ్యప్పస్వామి ఆల యంలో బుధవారం గురుస్వామి గోపిస్వామి చేతుల మీదుగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు పవన్‌కాంత్ తది తరులు పాల్గొన్నారు.